
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
గురువారం 5 జూన్ 2025


నేడు వన మహోత్సవం

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో కొత్తూరు సమీపంలోని నగరవనంలో వనమహోత్సవం జరగనుంది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రశాంత్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితోపాటు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. నగరవనంలో 4వేల మొక్కలు, జిల్లావ్యాప్తంగా ఐదు లక్షల మొక్కలు నాటనున్నారు. అన్ని శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలని ఇన్‌చార్జి కలెక్టర్ కే. కార్తీక్, జిల్లా అటవీ శాఖ అధికారి మహబూబ్ బాష కోరారు.

గురిపెడితే గురువులే!

యువత ఆశలన్నీ ఉపాధ్యాయ కొలువులపైనే. ఈసారి తీవ్ర పోటీ నేపథ్యంలో సమయం సమీపిస్తున్న కొద్దీ అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. 2018 తరువాత భారీస్థాయిలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ జరగనుండటంతో ఆశావహుల సంఖ్య పెరిగింది. అభ్యర్థులందరికీ శుక్రవారం నుంచి 30వ తేదీ వరకు అర్హత పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షకు సంబంధించి కొన్ని అంశాలు అందరికీ ఉమ్మడిగా ఉంటాయి. ఎస్జీటీలకు, స్కూల్ అసిస్టెంట్లకు, పీఈటీలు, టీజీటీలు, పండిట్‌లు అందరూ కొన్ని అంశాల్లో పోటీ పడాల్సి ఉన్నా తమ లక్ష్యంపై గురిపెడితే గురువులుగా విజయం సాధించడం తథ్యమని విద్యా ప్రముఖులు చెపుతున్నారు.

- నెల్లూరు(విద్య, ఆంధ్రజ్యోతి)



రాష్ట్ర ప్రభుత్వం విడుదలచేసిన మెగా డీఎస్సీకి పోటీ కూడా మెగాస్థాయిలోనే ఉంది. అయితే, అభ్యర్థులు సరైన ప్రణాళికతో సన్నద్ధమైతే అవకాశాన్ని చేజిక్కించుకోవచ్చు. జిల్లావ్యాప్తంగా జడ్పీ, ఎంపీపీ, మునిసిపల్, ప్రభుత్వ మేనేజ్‌మెంట్లలో 673 పోస్టులు భర్తీ చేయనున్నారు. వీటిలో 668 పోస్టులకు రోస్టర్ పాయింట్లు సిద్ధం చేసి పోస్టులు, కేటగిరీల వారీగా రిజర్వేషన్లు ఖరారు చేశారు. ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ స్కూళ్లలో 629, నగరపాలక సంస్థ పరిధిలోని స్కూళ్లలో 25, మున్సిపల్ స్కూళ్లలో 14 ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఇందుకు సంబంధించి డీఎస్సీ పరీక్షా విధానంలో కూడా ప్రిన్సిపల్, పీజీటీ, టీజీటీ పోస్టులకు పేపర్-1గా ఇంగ్లీష్ నైపుణ్య పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధిస్తే పేపర్-2 మార్కులు లెక్కిస్తారు. టీజీటీ, స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పోస్టులకు టెట్ వెయిటేజీ 20శాతం ఉంటుంది. డీఎస్సీ పరీక్షను 160 ప్రశ్నలతో 80 మార్కులకు కంప్యూటర్ బేస్డ్(సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు.

సాధనతోనే ఉపాధ్యాయ కొలువు

ప్రణాళికలతో సాధించడం సులువు

మొత్తం పోస్టులు : 673
అభ్యర్థులు : 15,993
పురుషులు : 6,173
మహిళలు : 9,820
అందిన దరఖాస్తులు : 28,772

మనో ధైర్యమే విజ్ఞానం

- విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం (సైకాలజీ)ని మనో ధైర్యంతో రాయాల్సి ఉంటుంది. పాఠశాల సహాయకులు, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్(టీజీటీ) వారికి తరగతి గది అనువర్తనాల పేరుతో పది ప్రశ్నలు ఇచ్చి ఐదు మార్కులు కేటాయిస్తారు. ఎస్జీటీ, గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు విద్యా మనో విజ్ఞాన శాస్త్రం పేరుతో 10 మార్కులకు 20 ప్రశ్నలు ఇస్తారు.
- ప్రశ్నను ఒకటికి రెండుసార్లు చదివాకే జవాబు ఎంపిక చేసుకోవాలి.
- పాఠశాల సహాయకులకు, టీజీటీలకు వైయుక్తిక భేదాలు, అభ్యసనం, మూర్తిమత్వం, ఎస్జీటీ, పీజీటీ వారికి వైయుక్తిక భేదాలు, అభ్యసనం, మూర్తిమత్వంలతోపాటు పెరుగుదల వికాసం చాప్టర్ చదవాల్సి ఉంటుంది.
- రెండో చాప్టర్‌లో వచ్చే అభ్యసనానికి సంబంధించి తరగతి గదిలో అంశాలను అన్వయిస్తూ లోతుగా చదవాల్సి ఉంటుంది.
- మూర్తిమత్వాన్ని సులువైన చాప్టర్‌గా పరిగణించినా ఇందులోనే ఎక్కువ తప్పులు చేస్తుంటారు. జాగ్రత్తగా సమాధానాలు రాయాలి.
- పెరుగుదల వికాసం చాప్టర్ ఎస్జీటీ, పీజీటీ రాసే వారికి మాత్రమే ఉంటుంది. ఈ చాప్టర్‌లో పెరుగుదల వికాసం, సూత్రాలు, వికాశదశలు, వికాస సిద్ధాంతాలు ప్రత్యేకంగా చదవాలి.
- బీఎడ్ మనో విజ్ఞానశాస్త్ర తెలుగు పుస్తకాలు, డీఎడ్ విద్యా మనోవిజ్ఞాన శాస్త్ర తెలుగు అకాడమీ పుస్తకాలను చదవాలి. గత ప్రశ్నాపత్రాలను ఖచ్చితంగా పరిశీలించుకోవాలి.

వర్తమాన అంశాలే మూలం

జనరల్ నాలెడ్జ్‌లో 20 ప్రశ్నలు అడిగితే 10 మార్కులు ఉంటాయి. కరెంట్ అఫైర్స్‌కు ప్రాధాన్యం పెంచారు. జనరల్ నాలెడ్జ్‌లో కూడా వర్తమాన ప్రాధాన్యంతో ముడిపడి ఉన్న ప్రశ్నలు అధికంగా వస్తాయి.

- తాజాగా ఆన్‌లైన్ పరీక్ష ఉండటంతో పరీక్ష తేదీకి రెండు రోజులు ముందు వరకు దినపత్రికలు చదవడం మంచిది.
- కరెంట్ అఫైర్స్ కోసం గత ఆరునెలల సమాచారం సమగ్రంగా, ఏడాది క్రితం వరకు అంశాలను విహంగవీక్షణ పద్ధతిలో చదవాలి.
- జీకేలో నృత్యాలు, కళలు, ఆవిష్కరణలు, విటమిన్లు, జంతు సంబంధిత ఆసక్తికర సమాచారం, జలపాతాలు, తెగలు, పత్రికలు, పుస్తకాలు, చారిత్రక కట్టడాలు, రాష్ట్రాల సమాచారం, హైకోర్టు, సుప్రీంకోర్టు, స్వాతంత్ర్యోద్యమం, జాతీయ-రాష్ట్ర చిహ్నాలు, సైన్స్ అండ్ టెక్నాలజీలు చదవాలి.
- ఎస్జీటీలు అయితే కంటెంట్‌ను చదివితే సిలబస్‌లోనే జీకేకు సంబంధించిన 90 శాతం సమాచారం కవర్ అవుతుంది. కరెంట్ అఫైర్స్‌పై ఎక్కువగా దృష్టి సారించాలి.
- గత ప్రశ్నాపత్రాలు ఒకసారి చదవడం, చూడడం వలన ఏ తరహా ప్రశ్నలు అడుగుతున్నారో తెలుస్తుంది.
- ఏడాదిగా వివిధ పోటీ పరీక్షల జనరల్ స్టడీస్ ప్రశ్నలను పరిశీలిస్తూ సన్నద్ధమైతే విజేతగా నిలవవచ్చు.

డీఎస్సీకి సన్నద్ధం

డీఎస్సీ పరీక్షలన్నీ కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్ పరీక్ష కావడంతో అన్ని వసతులు కలిగిన కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. జూన్ 6 నుంచి 30వతేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు షెడ్యూళ్లలో పరీక్షలు జరగనున్నాయి. ఏ రోజు ఏ పరీక్ష అన్నది అభ్యర్థుల మొబైల్ నెంబర్లకు మెసేజ్‌లు పంపిస్తున్నారు. లేదా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో కూడా పొందుపరిచారు. పరీక్షల నిర్వహణకు కలెక్టర్ చైర్మన్‌గా త్రీమెన్ కమిటీ నియమించారు. డిప్యూటీ ఈఓ, ఎంఈఓ, ఐటీ నిపుణుడు సభ్యులుగా ఉంటారు. వీరంతా పరీక్షల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుని ఉన్నతాధికారులకు నివేదికలు అందచేస్తారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న డీఆర్వో ఉదయ్‌భాస్కర్

పకడ్బందీగా 'మెగా' పరీక్షలు

● రేపటినుంచి ప్రారంభం.. 8 కేంద్రాల్లో నిర్వహణ

జిల్లాలో మెగా డీఎస్సీ-2025 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్ఓ ఉదయ్‌భాస్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డీఆర్ఓ ఛాంబర్‌లో బుధవారం ఆయన పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 8 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్షలకు 31,221 మంది అభ్యర్థులు సన్నద్ధంగా ఉన్నారని, వీరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు వైద్యశిబిరాలు, విద్యుత్ ఆటంకం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

హెల్ప్‌డెస్క్

డీఎస్సీ అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు డీఈఓ బాలాజీరావు తెలిపారు. హెల్ప్‌డెస్క్‌లో 6281704160, 8121947387, 8125046997, 9398810958, 7995649286, 7995789286, 9963069286, 7013837359 ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంటాయన్నారు. పరీక్ష కేంద్రంలో సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరన్నారు. నిర్దిష్ట సమయం కంటే గంట ముందుగా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తారని, నిబంధనలు కచ్చితంగా పాటించాలని తెలిపారు.

హెల్త్ ఎడ్యుకేటర్ పేరు మార్పు

నెల్లూరు (వైద్యం) : హెల్త్ ఎడ్యుకేటర్ పేరును డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారిగా ప్రభుత్వం మార్పు చేసిందని ఏపీ హెల్త్ ఎడ్యుకేటర్స్ సర్వీస్ వెల్ఫేర్ అసోషియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రావు పేర్కొన్నారు. బుధవారం ఇందుకు సంబంధించిన జీవో 64 ప్రతులను డీఎంహెచ్‌వో సుజాతకు అసోసియేషన్ నేతలతో కలిసి ఆయన అందచేశారు. కార్యక్రమంలో నాయకులు సునీత, జిల్లా నేతలు ఆరోగ్య మేరీ, అశోక్, ఉమర్, రమేష్ పాల్గొన్నారు.



వెంచటాలంలో తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న ఎంపీలు మిథున్‌రెడ్డి, గురుమూర్తి, వైసీపీ నాయకులు

జిల్లాలో 'వెన్నుపోటు దినం'

నెల్లూరు జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమం బుధవారం జిల్లావ్యాప్తంగా జరిగింది. అన్ని నియోజకవర్గ కేంద్రాలలో ఆ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు ఆందోళనలు చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక పోయిందంటూ విమర్శలు గుప్పించారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలంలో వైసీపీ నాయకులు భారీ ర్యాలీ చేపట్టి తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట, తిరుపతి ఎంపీలు పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, మద్దెల గురుమూర్తి, కాకాణి గోవర్ధన్ రెడ్డి కుమార్తె పూజిత పాల్గొన్నారు. నెల్లూరు నగరంలో వీఆర్సీ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ జరగ్గా, రూరల్ నియోజకవర్గ నేతలు రైల్వే ఫీడర్స్ రోడ్డులో ఆందోళన చేశారు. కోవూరు, కావలి, ఉదయగిరి, కందుకూరు, నియోజకవర్గాలలోనూ వైసీపీ నేతలు వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా నిరసన ర్యాలీ చేపట్టారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు.

వెంగమాంబ ఆలయ అభివృద్ధి ఎలా!?

● పరిశీలించిన అధికారుల బృందం

నర్రవాడలోని శ్రీ వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయాన్ని బుధవారం విజయవాడకు చెందిన దేవదాయ, ధర్మదాయ కార్యాలయం నుంచి వచ్చిన సాంకేతిక శాఖ అధికారులు, సహాయ స్థపతులు పరిశీలించారు. ఆలయంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనుల్లో భాగంగ దేవస్థాన నిర్మాణం, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పరిశీలనలో గుర్తించిన అంశాలను ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో అందజేయనున్నారు. వారి వెంట ఆలయ ఈవో ఉషశ్రీ, ఈఈలు జీవీఆర్ శేఖర్, కె.గంగయ్య, డిప్యూటీ స్థపతి ఎం.నాగేశ్వర రావు, డీఈ శ్రీనివాసరావు, ఏఈ మురళిమోహన్, టెక్నికల్ అధికారి బీ.రవి, అసిస్టెంట్ స్థపతి సురేంద్ర తదితరులు ఉన్నారు.

- దుత్తలూరు(ఉదయగిరి, ఆంధ్రజ్యోతి)

పీడ విరగడై ఏడాది!

జిల్లాలో జనసైనికుల పండుగ సంబరాలు



నెల్లూరులో చీడ, పీడలన్నీ తొలగిపోయేలా ఏడాది దిష్టిబొమ్మను తగలపెడుతున్న జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పీడ విరగడై ఏడాది అయిందంటూ బుధవారం జిల్లావ్యాప్తంగా జనసైనికులు పండుగ సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అయిన సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ఈ సంబరాల్లో పాల్గొన్నారు. నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో తెల్లవారుజామున వైసీపీ పీడ విరగడై ఏడాది.. సుపరిపాలనకు ఏడాది అంటూ భోగిమంటలు వేశారు. అనంతరం జిల్లా, నగర పార్టీ కార్యాలయాల వద్ద సంక్రాంతిని తలపించేలా రంగవల్లులను తీర్చిదిద్దారు. అనంతరం రాత్రి రాష్ట్రానికి దీపావళి మొదలై సంవత్సరం అయిందంటూ బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ జిల్లా నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా చీడ, పీడలన్నీ తొలగిపోయే విధంగా ఏడాది దిష్టిబొమ్మను తగలబెట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు జమీర్, శ్రీరామ్, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రవికుమార్, అబీద్ మీర్జా, తదితరులు పాల్గొన్నారు.



గజ వాహనంపై చాముండేశ్వరి దేవి

గంగపట్నంలో చాముండేశ్వరి దేవి అమ్మవారు బుధవారం రాత్రి గజవాహనంపై భక్తులకు దర్శనమిస్తూ ఊరేగారు. ఇక్కడ జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ఈవో తాతా శ్రీనివాసరావు, గుండాల కృష్ణారెడ్డి, కొండూరు వెంకటరమణారెడ్డి, కేతిరెడ్డి అవినాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- ఇందుకూరు పేట, (ఆంధ్రజ్యోతి)

రిటైరయ్యే ఉద్యోగులకు ఎలక్ట్రానిక్ పెన్షన్ మంజూరు

రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతిప్రియ

నెల్లూరు(హరనాథపురం), జూన్ 4(ఆంధ్రజ్యోతి) : రిటైరయ్యే ప్రభుత్వ ఉద్యోగులకు త్వరలో ఎలక్ట్రానిక్ పద్ధతిలో పెన్షన్ మంజూరు పత్రాలను అందచేస్తామని రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతిప్రియ చెప్పారు. బుధవారం నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో ప్రభుత్వ పెన్షన్, జీపీఎఫ్ సమస్యలపై ప్రత్యేక అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తమ పెన్షన్ ప్రతిపాదనల మంజూరు ఏజీ కార్యాలయంలో ఎలా జరుగుతుందో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పెన్షన్ ప్రతిపాదనలను పంపే సమయంలో దరఖాస్తుతోపాటు ఏయే పత్రాలను జత పరచాలో ప్రతిఒక్కరూ విధిగా తెలుసుకోవాలన్నారు. ఈ నెల నుంచి ఆర్థికశాఖ పరిధిలోని ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్, ఏపీజీఎల్ఐ తదితర శాఖల నుంచి రిటైరయ్యే ఉద్యోగులకు ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఈపీఎఫ్ పెన్షన్ మంజూరు పత్రాలను అందచేస్తామని చెప్పారు. రాష్ట్ర ట్రెజరీశాఖ డైరెక్టర్ మోహన్‌రావు, డీఆర్వో ఉదయ భాస్కర్‌రావు తదితరులు మాట్లాడారు. ప్రత్యేక అదాలత్‌లో 55 మందికి పెన్షన్ మంజూరు పత్రాలను, 15 మందికి జీపీఎఫ్ ఆథరైజేస్ లేఖలను అందచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ కిషోర్‌రెడ్డి, అధికారులు విజయ్‌కుమార్, భవానీప్రసాద్, సునీత, జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ గంగాద్రి, డీసీవో గురప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



పెన్షన్ పత్రాలను అందచేస్తున్న శాంతిప్రియ

ఆ డబ్బులు ఎక్కడివి.. ఎవరివి!?

- బీజీసీ క్యాపిటల్ ట్రేడింగ్‌లో రూ.80 లక్షల గల్లంతు
- బాధితుడు ఓ రాజకీయ నాయకుడి వద్ద గుమాస్తా
- అన్ని కోణాల్లో పోలీసుల దర్యాప్తు

- వివరాలు 8లో..



అందరి హృదయాల్లో బాలు

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా బుధవారం నెల్లూరులో గాయని రమణకు అవార్డు అందజేసి సత్కరిస్తున్న ఎస్పీ శైలజ, నటుడు శుభలేఖ సుధాకర్ తదితర ప్రముఖులు

8

హైవేపై తప్పిన ఘోరం



జాతీయ రహదారిపై అగ్నికి ఆహుతవుతున్న లారీ

మర్రిపాడు మండలం కంద్రిక వద్ద ముంబయి జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం తప్పింది. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో లారీ ఢీ కొట్టడంతో డీజిల్ ట్యాంక్ పగిలి క్షణాల్లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఢీ కొట్టిన లారీ మొత్తం కాలిపోయింది. పోలీసుల కథనం మేరకు... అదుపు తప్పిన ఓ ఆయిల్ ట్యాంకర్ హైవే పక్కన పడిపోయింది. దీనిని చూసేందుకు బద్వేలు వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ తన లారీని ఆపి ట్యాంకర్ వద్దకు వెళ్లాడు. అదే సమయంలో సిమెంట్ తయారీకి ఉపయోగించే బూడిద లోడుతో నెల్లూరు వైపు నుంచి వస్తూ హైవేపై ఆగి ఉన్న లారీని ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. తెల్లవారుజాము 4 గంటల నుంచి తెల్లవారే వరకు రహదారికి ఇరువైపులా వాహన రాకపోకలు ఆగిపోయాయి. ఆత్మకూరు సీఐ గంగాధర్, మర్రిపాడు ఎస్ఐ శ్రీనివాస్‌రావు సంఘటనా స్థలానికి చేరుకొని ఫైర్ ఇంజన్ ద్వారా మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలించలేదు. కాగా, ఈ ప్రమాదంలో డ్రైవర్లు సురక్షితంగా బయట పడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి)

'హౌసింగ్'లో సిమెంట్ బస్తాల మాయం

సీతారామపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని హౌసింగ్ కార్యాలయంలో జరిగిన అక్రమాలపై ఆ శాఖ ఈఈ మోహన్ రావు బుధవారం విచారించారు. ఈ క్రమంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏఈ కరీముల్లా మద్యం మత్తులో అధికారుల ముందే చిందులు తొక్కారు. గోదాములో 1080 బస్తాల సిమెంట్ ఉండాల్సి ఉండగా కేవలం 24 బస్తాలు మాత్రమే ఉండడంతో అధికారులు కంగుతిన్నారు. గతంలో ఇదే విధంగా కరీముల్లా సిమెంట్ అమ్ముకోవడంతో సస్పెండ్ అయ్యారు. మంగళవారం రాత్రి అందిన సమాచారం ప్రకారం వంద బస్తాలతో ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని దేవమ్మ చెరువు వైపు వెళ్తుండగా ఉన్నతాధికారులు పట్టుకున్నారు. గోదాములో 1056 సిమెంట్ బస్తాలు మాయం కావడంతో ఈఈ మోహన్ రావు విచారించి, ఏఈ కరీముల్లాపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



గోదాములో సిమెంటు బస్తాలను పరిశీలిస్తున్న ఈఈ మోహన్ రావు

మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ

తోటపల్లిగూడూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజన కార్మికులకు మండల విద్యాశాఖ అధికారి వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 జయరామనాయుడు, మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా ప్రెసిడెంట్ సీనమ్మ, మండల ప్రెసిడెంట్ రేవతి, సెక్రటరీ మమత పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9363
వెండి కిలో ధర	రూ. 104100
వెండి ఒక గ్రాము	రూ. 107.10



అందుబాటులో పోటీ పరీక్షల మెటీరియల్

● గ్రంథాలయ ఇన్‌చార్జ్ అధికారి వాసిలి అరుణ్ కుమార్

వెంకటాచలం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో గ్రూపు-1, గ్రూపు-2, డీఎస్సీ వంటి అనేక పోటీ పరీక్షల మెటీరియల్ అందుబాటులో ఉన్నట్లు వెంకటాచలం గ్రంథాలయ ఇన్‌చార్జ్ అధికారి వాసిలి అరుణ్ కుమార్ తెలిపారు. పోటీ పరీక్షలకు హాజరయ్యేవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

? గ్రంథాలయంలో ఎలాంటి పుస్తకాలు లభిస్తాయి.

! ఉద్యోగ సోపానం, విజేత వంటి పోటీ పరీక్షలకు సంబంధించిన నెలవారీ పుస్తకాలు, పంచతంత్ర, ఆరోగ్యం, కంప్యూటర్, మ్యాజిక్, సైన్స్ చరిత్ర వంటి అన్ని రకాల పుస్తకాలు లభిస్తాయి. అంతేకాకుండా దిన, వార, పక్ష, మాస పత్రికలు కూడా అందుబాటులో ఉంటాయి.

? గ్రంథాలయంలో పుస్తకాలను పొందడం ఎలా.

! గ్రంథాలయంలో తొలుత సభ్యత్వం తీసుకోవాలి. 15 ఏళ్లలోపు పిల్లలకు రూ.50 రుపాయలు, ఆపై వారికి రూ.100 చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకొని అన్ని పుస్తకాలను వినియోగించుకోవచ్చు.

? పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లొచ్చా.. గ్రంథాలయంలోనే చదవాలా.

! గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు ఉంటాయి. వాటిని అక్కడే చదువుకోవచ్చు. ఇంటికి అయితే ఒక పుస్తకం మాత్రమే ఇస్తాం. 13 రోజులలోపు చదువుకొని తిరిగి ఆ పుస్తకాన్ని ఇచ్చి మరలా ఇంకో పుస్తకాన్ని తీసుకెళ్లి చదువుకోవచ్చు.

జోరుగా పాత దుస్తుల అమ్మకాలు



సందడిగా సాగుతున్న పాత దస్తుల అమ్మకాలు

ముత్తుకూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ కూడలిలో పాత దుస్తుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ముత్తుకూరు మండలంలో కృష్ణపట్నంపోర్టు, థర్మల్ కేంద్రాలు, పామాయిల్ కర్మాగారాలతోపాటు వివిధ పరిశ్రమలు వున్నాయి. వేలాది మంది కార్మికులు ఈ పరిశ్రమల్లో పని చేస్తున్నారు. విధి నిర్వహణ సమయంలో వినియోగించేందుకు పాత దుస్తుల పట్ల కార్మికులు మక్కువ చూపుతుండడంతో పదుల సంఖ్యలో పాత దుస్తుల వర్తకులు అమ్మకాలు సాగిస్తున్నారు. రెండేళ్ల కిందట ఇద్దరు, ముగ్గురు ఆదివారం రోడ్డు పక్కన పాత దుస్తులు అమ్మేవారు. గిరాకీ పెరగడంతో అమ్మేవారు ఎక్కువయ్యారు. కొద్ది రోజులకు మార్కెట్ స్థలంలో రోజు బాడుగ కింద స్థలం తీసుకుని వరుసగా అమ్మకాలు ప్రారంభించారు. వారం రోజుల పాటు అమ్మకాలు సాగినా ఆదివారం మాత్రం రద్దీ విపరీతంగా ఉంటుంది. ఆదివారం ఒక్కరోజే అమ్మకాలు రూ.లక్ష వరకు ఉంటాయంటే ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ఎక్కువగా జీన్స్ దుస్తులు, మురికిని, దుమ్మును తట్టుకునే దళసరి దుస్తులకు గిరాకీ ఎక్కువని అమ్మకందారులు తెలిపారు.

మందులున్నా... వైద్యం సున్నా!



వైద్యులు లేని ఆయుష్ విభాగం

మనుబోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్ విభాగం ఏర్పాటు చేశా రు. ఇందులో పనిచేసే వైద్యులు ఎప్పుడు వస్తారో అక్కడున్న వైద్యసిబ్బందికే తెలియదు. అప్పుడప్పుడు వచ్చే వైద్యులు కూడా మానేయడంతో ఏడాది నుంచి వైద్యసేవలు అందడం లేదు. దీంతో వచ్చేపోయే రోగులకు ఇక్కడున్న అటెండ ర్, కాంపోండర్ మందుబిళ్లలు ఇచ్చి పంపుతుంటారు. ఉన్నతాధికారులు స్పందించి ఆయుర్వేద వైద్యులను నియమించాలని రోగులు కోరుతున్నారు.

- మనుబోలు(ఆంధ్రజ్యోతి)

C.R.I.M.E N.E.W.S

ఇద్దరు దొంగల అరెస్టు

● 10 మోటార్ సైకిళ్ల స్వాధీనం



పట్టుబడిన దొంగలతో వివరాలు వెల్లడిస్తున్న సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ శివరాకేష్

మనుబోలు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడడం..నేరాలు చేసి జైలు కెళ్ళడం...బెయిల్‌పై రావడం...మరల చోరీలు చేయడం ఆ యువకులకు అలవాటుగా మారింది. మనుబోలు, తదితర ప్రాంతాల్లో గడిచిన నాలుగునెలల్లో మోటార్ సైకిళ్ళ దొంగతనాలు చేస్తూ పోలీసులకు చుక్కలు చూపించారు. చివరకు మనుబోలు పోలీసులకు మంగళవారం చిక్కి ఊచలు లెక్కబెడుతున్నారు. పోలీసులు తమదైన శైలిలో వారిని విచారించి దొంగతనాలు చేసిన పది మోటార్‌సైకిళ్ళను రికవరీ చేశారు. దీనిపై బుధవారం పొదలకూరు సీఐ శివరామకృష్ణారెడ్డి పీఎస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మండలంలోని పిడూరు గ్రామానికి చెందిన యల్లంటి మౌళి అలియాస్ మౌళికృష్ణ గతంలో పలు చోరీలు చేసి జైలుకెళ్ళాడు. ఇదే తరహాలో కావలి రూరల్‌లోని బుడంగుంట కాలనీకి చెందిన షేక్ కలీం నేరాలు చేసి జైలు కెళ్ళాడు. వీరిద్దరికీ జైలులో సావాసం కుదిరింది. ఫిబ్రవరిలో బెయిల్‌పై ఇద్దరూ బయట కొచ్చారు. అప్పటినుంచి మరల చోరీలు చేయడం ఆరంభించారు. మనుబోలులో 7 మోటార్‌సైకిళ్లు, గూడూరు పట్టణం, కొడవలూరు, ఇందుకూరుపేటలో ఒక్కొక్కటి కలిపి మొత్తం పది మోటార్ సైకిళ్ళు చోరీచేశారు. రాత్రి సమయంలో ఇంటిబయట, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న మోటార్‌సైకిళ్ళు గుర్తించడం, వాటిని మారుతాళాలు పెట్టి తీసి తస్కరించడం వీరికి వెన్నతోపెట్టిన విద్య. ఇలా చోరీచేసిన మోటార్‌సైకిళ్లను రెండు ప్రాంతాల్లో దాచి ఉంచారు. ఆరు మోటార్‌సైకిళ్ళు మౌళీ ఒక్కడే చోరీచేయగా, నాలుగు మోటార్‌సైకిళ్ళు ఇద్దరూ కలిసి దొంగిలించారు. ఈ నేపథ్యంలో మంగళవారం వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఎస్ఐ శివరాకేష్ వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు యువకులు మోటార్ సైకిళ్ళపై అటుఇటు తిరుగుతుండగా పోలీసులకు అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ కాబడిన మోటార్ సైకిళ్ల వివరాలు వెలుగులోకి వచ్చాయి. చోరీచేసిన మోటార్ సైకిళ్ళను దాచిఉంచిన ప్రాంతం నుంచి తీసుకువచ్చి స్టేషన్‌లో ఉంచారు. వీటి విలువ రూ. 3లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. ఇద్దరు నేరస్తులను అరెస్టు చేసి గూడూరు కోర్టుకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరచిన మనుబోలు ఎస్ఐ, సిబ్బందికి సీఐ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

పేకాట స్థావరంపై దాడి

● ఆరుగురి అరెస్టు ● రూ. 1.6 లక్షల స్వాధీనం

ఏఎస్ పేట, జూన్4 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై దాడిచేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్ పేట ఎస్ఐ సైదులు బుధవారం తెలిపారు. మండలంలోని జువ్వలగుంట పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో తన సిబ్బందితో కలసి దాడిచేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 1,60,890 రూపాయల నగదు, 5 సెల్ ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పేకాట ఆడడం, చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేపడితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇంట్లో చోరీ

నెల్లూరు(క్రైం), జూన్ 4(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు.ఈ ఘటన నగరంలోని బీవీనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు, బీవీనగర్ ఎల్ఐసీ కాలనీలో రవిశంకర్‌రెడ్డి నివాసం ఉంటున్నారు. ఆయన కటుంబసభ్యులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఆయన ఈనెల 3న రాత్రి పైగదిలో నిద్రపోయారు. కింద గదిలో పనిమనిషి నిద్రపోయింది. బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు కిటికీ గ్రిల్స్‌ను తొలగించి లోపలికి ప్రవేశించారు. బీరువాలోని 25 గ్రాముల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉదయగిరిలో..

ఉదయగిరి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలాజీ నగర్‌లో గుర్తుతెలియని వ్యక్తి చోరీకి పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మద్దా రవికుమార్ నివాసంలోకి అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ప్రవేశించి కబోర్డులో ఉంచిన రూ. 12వేల నగదు, రెండు సవర్ల బంగారు ఆభరణాలను చోరీచేశాడు. ఉదయం చోరీ జరిగిందని గుర్తించిన రవికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి బుధవారం తెలిపారు.

ఘర్షణపై కేసు నమోదు

ఉదయగిరి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శకునాలపల్లి పంచాయతీ బోడబండ గ్రామంలో ఇరు కుటుంబీకుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి బుధవారం తెలిపారు. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కావ్య కుమార్తె ప్రణీత తన బంధువైన ప్రశాంతి దగ్గరకు వెళ్లి వివాహ విషయంపై మాట్లాడింది. దీంతో ఇరు కుటుంబాల మధ్య వివాదం చోటుచేసుకొని ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనకు సంబంధించి ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 12 మందిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

వ్యభిచార కేంద్రంపై దాడులు

● ముగ్గురి అరెస్ట్

నెల్లూరు(క్రైం), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆర్టీవో కార్యాలయం సమీపంలో ఇళ్లమధ్యలో నిర్వహిస్తున్న వ్యభిచార కేంద్రంపై వేదాయపాలెం పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి ఈ దాడులు చేశారు. నిర్వాహకురాలు శివరంజనితోపాటు మనోహర్, జయరామయ్యను అరెస్ట్ చేశారు. సెక్స్ వర్కర్‌ను హోమ్‌కు తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని తిక్కన పార్కు సమీపంలోని జాఫర్‌సాహెబ్ కాలువ వద్ద గుర్తుతెలియని(60) వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, సంతపేట పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ బాలకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. వృద్ధుడు మూడు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని తెలుస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

● పట్టించుకోని విద్యుత్ సిబ్బంది



తోటపల్లిగూడూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. ఈదూరు పంచాయతీ పరిధిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడంతో పశువులు మేతకు వెళ్లినప్పుడు దానికి తగిలి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. అంతేగాక జడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా విద్యుత్ తీగలకు పిచ్చిమొక్కలు అల్లుకుపోతున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు రక్షణ కంచెలు ఏర్పాటుచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రజలను ముంచిన మీరు..

వెన్నుపోటు దినం అంటారా?

● వైసీపీ నేతలపై ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మండిపాటు



వృద్ధురాలి సమస్యను ఆలకిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం,జూన్4(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ప్రజలను నిలువునా ముంచిన మీరు కూడా వెన్నుపోటు దినం పేరుతో మాట్లాడటం విడ్డూరంగా ఉందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వైసీపీ నాయకులపై మండిపడ్డారు. బుధవారం బుచ్చిలోని 7,8,9 వార్డుల్లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఆమె అర్జీలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైనవారికి ఇళ్ల స్థలాలు ఎంతమందికి ఇచ్చారు. ఇళ్లు కట్టించారు. అసలు కాంట్రాక్టర్లు సక్రమంగా కట్టారా.. ? ఆ ఇళ్ళలో కాపురాలు చేస్తున్నారా..? అని ప్రశ్నించారు. హౌసింగ్‌లోనే కాదు.. ఇరిగేషన్ కాలువల్లో పూడికతీత పేరుతో వైసీపీ నాయకులు చేసిన అవినీతికి, తిన్నదానికి అవధులు ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మురళి, పార్టీ అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు, రూరల్ అధ్యక్షుడు బెజవాడ జగదీష్, నాయకులు హరికృష్ణ, ఎంవీ.శేషయ్య, వైస్ చైర్మన్లు పుట్టా శివకుమార్‌రెడ్డి, నస్రీన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి సన్మానం : బుచ్చిలోని 7వవార్డు పర్యటనలో ఆ వార్డు కౌన్సిలర్ షకీలా బేగం, భర్త డాక్టర్ అల్లాభక్షు దంపతులు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని పూలమాల, శాలువాతో సత్కరించి ఆవార్డు కౌన్సిలర్‌గా పరిచయం చేసుకున్నారు. వార్డు అభివృద్ధిని కోరారు.

జనసేన నేతల సంబరాలు



పొదలకూరు : బాణసంచా కాల్చుతూ సంబరాలు జరుపుకుంటున్న జనసేన నేతలు, కార్యకర్తలు



వెంకటాచలం : ముగ్గులు వేసిన మహిళలతో జనసేన నేతలు

పొదలకూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ఏడాది పాలన పురస్కరించుకుని బుధవారం సాయంత్రం స్థానిక శ్రామికనగర్‌లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి, బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జనసేన సర్వేపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జ్ బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, నారదాసు రవి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఓటు అనే ఆయుధంతో 2024 జూన్ 4న ప్రజా పాలనకు బాటలు వేశారన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ కుటిల రాజకీయాన్ని గ్రహించిన ప్రజలు వైసీపీని రాష్ట్రంలో కూకటివేళ్లతో పెకలించి వేశారన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ ఆధ్వర్యంలో ప్రజా పాలన జరుగుతోందని, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ బడుగు బలహీన వర్గాలకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ముందుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధు, ఆనంద్, విజయ్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● వెంకటాచలం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకుందని జనసేన పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు అన్నారు. ఈ సం దర్భంగా మండలంలోని తిరుమల మ్మపాళెం గ్రామంలో బుధవారం జనసేన ఆధ్వర్యంలో సంబరాలను నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కలిసి నడిపిస్తున్నారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనతో రాష్ట్ర ప్రజలు నర కాన్ని చూశారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణి భవాని, నేతలు పినిశెట్టి మల్లికార్జున్, సందూరి శ్రీహరి, చల్లా చెంచయ్య, మణి, షేక్ రహీమ్, అక్బర్, చిన్న తదితరులున్నారు.

ఇంటింటికి చెత్తబుట్టల పంపిణీ



మనుబోలు దళితవాడలో చెత్తబుట్టలు పంపిణీ చేస్తున్న కార్యదర్శి గరుడయ్య

మనుబోలు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండల కేం ద్రమైన మనుబోలు పంచాయతీలో బుధవారం కార్యదర్శి గరుడయ్య దళితవాడలో చెత్తబుట్టల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గరుడయ్య మాట్లాడుతూ ఇంటికో బుట్ట చొప్పున ఇప్పటికే వెయ్యి ఇళ్ళకు పంపిణీ చేశామ న్నారు. మరో రెండు కాలనీల్లో ఇవ్వాల్సి ఉంద న్నారు. ప్రతి ఇంటి నుంచి తడి చెత్తను ఇచ్చిన బుట్టలో, పొడిచెత్తను వేరుగా చేసి ఉంచాలన్నా రు. వారానికి రెండు దఫాలుగా పంచాయతీ చెత్తబండి వస్తుందని, అందులో వేయాల న్నారు. ఇంటిలో చెత్తను ఎక్కడపడితే అక్కడ వీధుల్లో వేయవద్దని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ జూనియర్ అసిస్టెంటు శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

కోవూరులో 'వెన్నుపోటు దినం'



కోవూరులో వైసీపీ నేతల నిరసన ప్రదర్శన

కోవూరు, జూన్4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన వెన్నుపోటుదినం నిరసనలో భాగంగా బుధవారం స్థానిక బజారు కూడలి నుంచి ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వరకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన ప్రదర్శన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగి ఈ కార్యక్రమంలో నాయకులు నల్లచొక్కాలు ధరించి నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన వాగ్దానాల్ని నెరవేర్చలేదని విమర్శించారు. నిరసన కార్యక్రమంలో వైసీపీ నాయకులు నల్లపరెడ్డి రజితకుమార్‌రెడ్డి, వీరి చలపతిరావు, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, అత్తిపల్లి అనూప్‌రెడ్డి, శివుని నరసింహులురెడ్డి, కవరగిరి ప్రసాద్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

రాపూరులో...

రాపూరు : వెంకటగిరి నియోజకవర్గం వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సిద్దలయ్య దేవాలయం సెంటర్ నుంచి పాత బస్టాండ్ మీదుగా మండల రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు పాపకన్ను మధుసూదన్ రెడ్డి, అనిల్ రెడ్డి, దందోలు నారాయణ రెడ్డి, బొడ్డు మధుసూదన్ రెడ్డి, ఏటూరి మురళి, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాంకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు

ఎమ్మెల్యేగా ప్రశాంతిరెడ్డి రావడం అదృష్టం



కల్వర్టు పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం,జూన్4(ఆంధ్రజ్యోతి): కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి రావడం మన అదృష్టమని బుచ్చి నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజమురళి అన్నారు. బుధవారం బుచ్చి ఖాజానగర్‌లో కల్వర్టు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాజానగర్‌లో గుడపల్లికాలువపైన కల్వర్టు కూలిపోయి ఏళ్ల గడచినా అధికారులుకానీ ప్రజా ప్రతినిధులుకానీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇటీవల ఖాజానగర్ పర్యటనలో ఎమ్మెల్యేకి ఈ విషయం తెలియజేయడంతో వెంటనే ఎంపీ దృష్టికి తీసుకెళ్లి రూ.4.40 లక్షలు మంజూరు చేయించడంపై ఎమ్మెల్యే స్పందనను ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు, వైస్ కౌన్సిలర్లు, ఆ వార్డు కౌన్సిలర్ రహమత్, పర్వీన్, పీఆర్ ఏఈ, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు నివాళి



నాగభూషణం పార్థీవదేహనికి నివాళులర్పిస్తున్న సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

వెంకటాచలం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంటేపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మిద్ది నాగభూషణం అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కంటేపల్లిలోని వారి నివాసానికి చేరుకుని నాగభూషణం పార్థీవదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల కోసం రూ.10 వేలు తన సొంత నగదును అందజేశారు. ఆయన వెంట స్థానిక టీడీపీ నేతలు ఆస్తోటి నాగరాజు, ఆస్తోటి సుబ్బయ్య, షేక్ రఫీ, కూర్రపాటి ఏడుకొండలు, ఎం సుబ్బయ్య, వినోద్, రత్నం తదితరులున్నారు.

తప్పులను సవరించండి

● జీఎస్‌డబ్ల్యూఎస్ రాష్ట్ర డైరెక్టర్ శివప్రసాద్‌కు వినతి

కందుకూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో వలంటీర్లు, సచివాలయం సిబ్బంది నిర్వహించిన సాధికార సర్వేలో అంగన్‌వాడీ ఆయాలు నెలకు రూ.12000 గౌరవ వేతనం తీసుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులు కింద నమోదే చేశారని, ఆ తప్పును సవరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ బుధవారం విజయవాడలోని జీఎస్‌డబ్ల్యూఎస్ రాష్ట్ర డైరెక్టర్ ఎం శివప్రసాద్‌ను కలిసి కోరారు. వాస్తవానికి అంగన్‌వాడీ ఆయాలకు నెలసరి గౌరవ వేతనం రూ.7000 మాత్రమేనని, అయితే ఆ సర్వే ఇప్పటికి కొనసాగుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలకు అంగన్‌వాడీ ఆయాలు అనర్హులుగా ఆన్‌లైన్‌లో చూపిస్తుందని ఆధారలతో చూపించారు. దీనిపై స్పందించిన శివప్రసాద్ రెండు రోజుల్లో సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చినట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. తల్లికివందనం వంటి పథకాలు దూరం కాకుండా వెంటనే సమస్యను పరిష్కరించాలని లేదంటే ఆందోళన చేపడతామని జిల్లా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కుంకాలమ్మసేవలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లేబూరులో వెలసివున్న కుంకాలమ్మకు బుధవారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గ ప్రజలు కుంకాలమ్మ దయతో చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, కే.కమలాకర్‌రెడ్డి, బీజేపీ నాయకులు పీ.సురేందర్‌రెడ్డి, ఏకొల్లు పవన్ కుమార్‌రెడ్డి, కే.మధురెడ్డి, కూక ట్ వెంకటేశ్వర్లురెడ్డి, అవ్వారు ఏడకొండలు పాల్గొన్నారు.

వెంకటాచలంలో వెన్నుపోటు దినం

వెంకటాచలం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వెంకటాచలంలో బుధవారం మాజీ మంత్రి కాకాణి కుమార్తె పూజితరెడ్డి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాజంపేట, తిరుపతి ఎంపీలు మిథున్‌రెడ్డి, గురుమూర్తిలు విచ్చేశారు. అనంతరం సర్వేపల్లి క్రాస్ రోడ్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు తదితరులున్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

వలేటివారిపాలెం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన చీఫ్‌ఇంజనీర్ శేఖర్‌తో కలిసి పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డీసీ కేవీ.సాగర్‌బాబు, టీడీపీ నేత మాదాల లక్ష్మీనరసింహం, ఎస్ఐ మరిదినాయుడు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	127
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 525

మెడికవర్‌లో గుండెకు ఆధునిక వైద్యం

నెల్లూరు (వైద్యం) : మెడికవర్ ఆసుపత్రిలో గుండె వ్యాధులకు అత్యాధునిక వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ విజయ్ అమర్‌నాథ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియచేశారు. గుండె కవాటాలు సరిగ్గా పనిచేయకపోతే గుండె వ్యాధులు వస్తాయన్నారు. అలాగే గుండెపోటు, గుండె వైఫల్యం వల్ల గుండె కవాటాలపై ఒత్తిడి పెరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో అలాంటి వ్యాధులకు అత్యా.దునిక వైద్య చికిత్సలు అందించి నయం చేస్తామని పేర్కొన్నారు.

హౌసింగ్ అధికారులపై చర్యలకు వినతి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 4(ఆంధ్రజ్యోతి) : అవినీతికి పాల్పడిన హౌసింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత మిడతల రమేష్ డీఆర్వో ఉదయబాస్కర్‌రావుకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవినీతికి పాల్పడి సస్పెన్షన్‌లో వున్న సంగం ఏఈపై విచారణ పూర్తి చేయకుండా మళ్లీపోస్టింగ్ ఇవ్వటమేమిటని ప్రశ్నించారు. అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రెగ్యులర్ అధికారులు వచ్చేనా ?

● మూడేళ్లగా ఇన్‌చార్జి ఎంపీడీవో సేవలు ● ఇటీవల తహసీల్దారు సస్పెన్షన్‌తో పోస్టు ఖాళీ ● బదిలీల నేపథ్యంలో కొత్తవారి కోసం ఎదురుచూపులు

నెల్లూరురూరల్, జూన్4,(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ మండలంలోని ప్రధాన పోస్టుల్లో రెగ్యులర్ అధికారులు లేక ఇన్‌చార్జిల పాలన సాగుతోంది. 2022 నుంచి ఇన్‌చార్జి ఎంపీడీవోగా శైలేంద్రకుమార్ వ్యవహరిస్తున్నారు. తహసీల్దారుగా ఉన్న లాజరస్ గతనెలలో సస్పెండ్ కావడంతో సిటీ తహసీల్దారుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. తాజాగా ప్రభుత్వం బదిలీలకు అవకాశం కల్పించడంతో కొత్త అధికారులు రాక కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.



నెల్లూరు రూరల్ మండల తహసీల్దారు కార్యాలయం

● ప్రజల ఇక్కట్లు

18 గ్రామ పంచాయతీలతో ఏర్పడిన నెల్లూరు రూరల్ మండలంలో సుమారుగా 40 వేలమంది జనాభా ఉంటారు. నెల్లూరుకి ఆనుకుని చుట్టూ ఉన్న పల్లె ప్రాంతమంతా రూరల్ పరిధిలోకి వస్తుంది. ప్రభుత్వ పథకాల అమలు, వివిధ సర్వేలు, పంచాయతీల్లో అభివృద్ధి పనులు, పారిశుధ్య పర్యవేక్షణలను ఎంపీడీవో దగ్గరుండి చూసుకోవాల్సి ఉంది. ఇక భూసమస్యలు, ఎన్నికలు, ఓటరు జాబితాల తయారీ, భూ బదలాయింపులను తహసీల్దారు పర్యవేక్షించాలి. ఈ రెండు బాధ్యతలు గ్రామ పాలనలో కీలకమైనవి. గ్రామాల్లో భూ వివాదాలు పరిష్కరించడంతో రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ప్రజలు పాలన పరమైన ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు.

● తాజా బదిలీలపై ఆశలు

అధికారుల బదిలీలకు అవకాశం కల్పించిన ప్రభుత్వం ఈ మేరకు ప్రక్రియను మొదలుపెట్టింది. ఇందులో భాగంగా నెల్లూరు రూరల్ మండలానికి ఎంపీడీవో, తహసీల్దారు కొత్తవారు వస్తారేమోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం, దానికి ముందు టీడీపీ ప్రభుత్వాల్లోనూ మండలంలోని ఈ రెండు పోస్టుల్లో ఎక్కువగా ఇన్‌చార్జిలే కొనసాగారు. ఇప్పటికైనా రెగ్యులర్ అధికారులను నియమిస్తారేమో చూడాలి.

దివ్యాంగుల బాధలు తీర్చకలిగితే సంతోషం



దివ్యాంగులకు అభివాదం చేస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, జూన్4,(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల బాధలు కొంచమైనా తీర్చగలిగితే తనకు ఎంతో సంతోషమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం వీపీఆర్ కన్వెన్షన్ హాల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి చెందిన 100 మంది దివ్యాంగులకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డితో కలిసి ఆయన ట్రై సైకిళ్లను అందచేశారు. లబ్ధిదారులను పేరు పేరునా పలకరించిన యోగక్షేమాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 950 మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందించామని తెలిపారు. తమ ఫౌండేషన్ ద్వారా వీటిని దివ్యాంగులకు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 170 వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నెల్లూరు ఎంపీగా వీపీఆర్ రావడం అందరి అదృష్టమని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఎంపీగా ఆయన అందిస్తున్న సహాయ సహకారాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ జడ్ శివప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, ఎల్‌సీ రమణారెడ్డి పాల్గొన్నారు.

● కూటమి పాలన ఏడాదిపై సంబరాలు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 4(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా నగరంలోని ఎంపీ వేమిరెడ్డి నివాసంలో బుధవారం సంబరాలు చేసుకున్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు వారి నివాసంలో అభిమానులు, నాయకులు, కార్యకర్తల సమక్షంలో భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రశాంతిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డికి కేక్ తినిపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డేవిడ్ జాన్,బుచ్చి అర్బన్, రూరల్ మండలాల అధ్యక్షులు గుత్తాశ్రీనివాసరావు, బెజవాడ జగదీష్‌లతో పాటు కోవూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'వెన్నెలకంటి'ని ఆదర్శంగా తీసుకోవాలి : కేసీ



వెన్నెలకంటి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కేసీ పెంచలయ్య తదితరులు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 4(ఆంధ్రజ్యోతి): పద్మభూషణ్ వెన్నెలకంటి రాఘవయ్య ఆశయాలను గిరిజన యువత ఆదర్శంగా తీసుకోవాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య కోరారు. బుధవారం నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో వెన్నెలకంటి 128వ జయంతి జరిగింది. రాఘవయ్య విగ్రహానికి నాయకులు పూలమాలలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేసీ మాట్లాడుతూ రాఘవయ్య గిరిజనోద్ధరణకు అహర్నిశలు కృషి చేశారన్నారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని ఏప్రాంతంలోనైనా వెన్నెలకంటి రాఘవయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ యానాది సంఘాల నాయకులు చేవూరు సుబ్బారావు, మానికల మురళి, చెంబేటి ఉష, కల్లూరు వరలక్ష్మి, ఇండ్ల రమ, మానికల నాగమణి, పొల్లూరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను పెంపును వ్యతిరేకించండి



పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఎం నేతలు

నెల్లూరు (వైద్యం) జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటును, ఇంటి పన్నుల పెంపును తీవ్రంగా వ్యతిరేకించాలని సీపీఎం సెక్రటేరియట్ సభ్యులు, మాదాల వెంకటేశ్వర్లు కోరారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ప్రజలపై అదనపు భారాలు మోపుతుందని విమర్శించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించి ప్రీపెయిడ్, పీక్ అవర్స్‌లో అదనపు భారాలు మోపుతుందని తెలిపారు. అలాగే ఇంటి పన్నులు పెంచేందుకు ఇళ్లిల్లూ తిరిగి అన్ అసైడ్, అండర్ అసైడ్ పేరుతో సర్వే చేస్తుందన్నారు. ఈ పెంపును వ్యతిరేకిస్తూ నిరసనలు తెలియచేస్తామని హెచ్చరించారు. సింహపురి పౌరసమాఖ్య నగర కార్యదర్శి అత్తిమూరు శ్రీనివాసులు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు కతారి అజయ్‌కుమార్, పెంచలనర్సయ్య, సూర్యనారాయణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ని పూర్తిగా నిషేధించాం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

నెల్లూరు(సిటీ), జూన్4,(ఆంధ్రజ్యోతి) : నగరంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించామని, క్రయ, విక్రయాలపై తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధిస్తున్నట్లు కమిషనర్ నందన్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గురువారం చేపట్టే అవగాహన ర్యాలీపై బుధవారం కార్పొరేషన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులతో కలిసి మాట్లాడారు. గురువారం ఉదయం 7 గంటలకు వీఆర్సీ నుంచి ఏసీ స్టేడియం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు ప్లాస్టిక్ వస్తువుల ఉత్పత్తి, రవాణా , నిల్వ, అమ్మకాలపై నిషేధం విధించినట్లు తెలిపారు. ముందుగా ట్రేడ్ లైసెన్సులపై సమీక్ష నిర్వహించారు. తమ ఆసుపత్రి మార్గంలో సీసీరోడ్డు నిర్మించాలని కమిషనర్‌ను రామచంద్రారెడ్డి ఆసుపత్రి వైద్యులు కోరారు. అనంతరం వారి విజ్ఞప్తిమేరకు ఆసుపత్రిని సందర్శించారు.

వ్యవసాయాధికారుల సూచన మేరకే ఎరువులు వాడాలి

ఉదయగిరి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అధికారుల సూచన మేరకే రైతులు పొలాలకు ఎరువులు, పురుగు మందులు వాడాలని నెల్లూరు వరి ప్రధాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త వినీత సూచిం చారు. బుధవారం మండలంలోని కృష్ణంపల్లి రైతుసేవా కేంద్రంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాల ఉపయో గాలపై అవగాహన కల్పించారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలి



స్టేషన్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వేదాయపాలెం పోలీసు స్టేషన్‌ను బుధవారం ఎస్పీ జీ. కృష్ణకాంత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిధులు, భౌగోళిక స్థితిగతులు, పరిసరాలు, రిసెప్షన్ గదిని, శాంతి భద్రతల పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్‌లు, పాతనేరస్థులపై నిఘా పెంచాలన్నారు. క్రిమినల్ చర్యలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ వ్యవస్థను ముమ్మరం చేయాలని, చైన్ స్నాచింగ్‌పై ప్రత్యేక దృషి సారించాలన్నారు. ప్రాపర్టీ నేరాల నియంత్రణకు కృషి చేయాలని, దొంగతనం కేసులో కోల్పోయిన ప్రాపర్టీ రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అనుమానాస్పద మరణాలు, మహిళా సంబంధిత కుటుంబ తగాదాలు, మిస్సింగ్ కేసులపై సత్వరమే స్పందించాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని, కనీస సౌకర్యాలు అందించి, వారికి ధైర్యం కల్పించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. తనిఖీల్లో నగర డీఎస్పీ పీ. సింధుప్రియ పాల్గొన్నారు.

ఎస్పీ బాలుకు ఘన నివాళి



ఎస్పీ బాలు విగ్రహానికి నమస్కరిస్తున్న యోగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆదిత్యనగర్‌లోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిల్డ్రన్స్ పార్కులో బుధవారం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని యోగా సభ్యులు, వాకర్స్ సభ్యులు సంయుక్తంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా బాలు విగ్రహానికి పుష్పమాలలు వేసి స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎం.సతీష్‌కుమార్, యోగా మాస్టర్ రవీంద్ర, పార్కు సిబ్బంది, తదితరులు పెద్ద సంఖ్యలో వాకర్లు పాల్గొన్నారు.

వైసీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం



నగరంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వైసీపీ నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా వైసీపీ నాయకులు బుధవారం వెన్నుపోటు దినం నిర్వహించారు. నగరంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వీఆర్సీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. తదుపరి కలెక్టరేట్‌లోని ఏవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఏడాది కిందట కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ప్రజలకు అబద్ధపు హామీలు గుప్పించి మోసం చేసిందన్నారు. హామీలన్నింటిని అమలు చేయాలని కోరుతూ జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వెన్నుపోటు దినం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకులు జంకె వెంకటరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అజీజ్‌ను కలిసిన అహ్మద్ షరీఫ్



అజీజ్‌ను కలిసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షరీఫ్

నెల్లూరు (వైద్యం) జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌ను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు అహ్మద్ షరీఫ్ నగరంలోని అజీజ్ నివాసంలో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా మైనార్టీ గురుకుల పాఠశాల అభివృద్ధితోపాటు పలు కీలక అంశాలపై చర్చించారు.

నేడు బహిరంగ వేలం

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రంగనాయకులపేట శ్రీవెంకటమ్మ పేరంటాలమ్మ ఆలయ స్థలం లీజుకి గురువారం వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో మోహన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి చెందిన ప్లాట్లు మనుమసిద్ధినగర్‌లో సర్వే నెంబరు 107లో ఉన్నాయని, అలాగే ఎకరా 24సెంట్ల భూమిని రెండు బిట్లుగా 11 ఏళ్ల కాల పరిమితికి వేలం నిర్వహిస్తామన్నారు. ఉదయం 11.30 గంటలకు వేటం జరుగుతుందన్నారు.

నగరంలో రౌడీషీటర్‌పై పీడీయాక్ట్ నమోదు

నెల్లూరు(క్రైం), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) :వరుస నేరాలకు పాల్పడుతున్న ఓ రౌడీషీటర్‌పై పీడీయాక్ట్ నమోదు ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు ఎన్‌టిఆర్‌నగర్ మూడుజెండాల సెంటర్‌కు చెందిన కర్తం అవినాష్‌పై బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. ఆయన పదే పదే నేరాలకు పాల్పడుతుండటంతో కలెక్టర్ అనుమతితో పోలీసు అధికారులు పీడీయాక్ట్ నమోదు చేశారు. గత నెల 30వ తేది ఆతనిని కడప కేంద్రకారాగారానికి తరలించారు. ఈ క్రమంలో బుధవారం పీడీయాక్ట్‌ను ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పెళ్లి కానుక అందజేత

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గండిపాళెం మార్గంలోని క్రిష్టియన్ పాళెంలో బండారి బాబురావు, గురవమ్మల కుమార్తె ఎస్తేరు వివాహం సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచన మేరకు టీడీపీ నాయకులు బుధవారం కాకర్ల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10 వేలు పెళ్లి కానుక అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, గడ్డం వెంకటేశ్వర్లు, నరసింహ, మతకాల శ్రీనివాసులయాదవ్ తది తరులు పాల్గొన్నారు.

హైరిస్క్ ప్రజలను గుర్తించి, క్షయ పరీక్షలు చేయండి




మాట్లాడుతున్న అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి

నెల్లూరు (వైద్యం) జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో హైరిస్క్ ప్రజలను గుర్తించి, వారికి క్షయ నిర్ధారణ పరీక్షలు చేయాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్మూలనకు ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త్ భారత్ కార్యక్రమం ఈ నెల 2వ తేదీ నుంచి 100 రోజులు జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో క్షయ అనుమానితులను గుర్తించి వారికి క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్‌లు రక్తనమూనాల ఫలితాలను సకాలంలో అందచేయాలని తెలిపారు. రక్తపూతల తీయ విధానంపై ఏఎన్‌లకు తగిన శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా అదనపు జిల్లా వైద్యాధికారి నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో రోడ్డు ప్రమాదం
ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మృతి

అనంతపురం సెంట్రల్/విడపనకల్లు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్ణాటక సరిహద్దు వద్ద భారత్ పెట్రోలు బంక్ సమీపాన బుధవారం మధ్యాహ్నం కారును గ్యాస్ ట్యాంకర్ ఢీకొన్న ప్రమాదంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి (50) మరణించారు. స్థానికులు, విడపనకల్లు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామమూర్తి అనంతపురంలోని అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తుండేవారు. వ్యక్తిగత పని మీద అనంతపురం నుంచి బళ్లారికి కారులో బయల్దేరారు. ఉరవకొండ-అనంతపురం 42వ జాతీయ రహదారిపై బళ్లారి నుంచి అనంతపురం వస్తున్న గ్యాస్ ట్యాంకర్ ఎదురుగా వచ్చి కారును ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న రామమూర్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు.. ఆయనను బయటకు తీసి విడపనకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తీసుకెళ్లారు. అక్కడ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం ఆయన మరణించారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గురువారం పోస్టుమార్టం నిర్వహించి నెల్లూరు జిల్లా అల్లూరు మండలంలోని సొంతూరికి మృతదేహాన్ని తరలించనున్నారు. రామమూర్తికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు బీటెక్ పూర్తిచేయగా, కుమార్తె అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలోనే బీటెక్ చదువుతోంది. రామమూర్తి మృతికి కళాశాల చైర్మన్ అనంతరాముడు, వైస్‌చైర్మన్ రమేష్ నాయుడు సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని వారు పేర్కొన్నారు.



తీవ్రంగా గాయపడిన ప్రిన్సిపాల్ రామమూర్తి

రెండు లక్షలకుపైగా మొక్కలు నాటాం..



గణేష్ మిత్రమండలి ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2015 నుంచి జిల్లా వ్యాప్తంగా 2లక్షలకుపైగా మొక్కలు నాటామని ఆ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీరాములు తెలిపారు. తాము విద్యానిలయాలు, పాఠశాలలు, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో మొక్కలు నాటడమేకాక వాటి సంరక్షణకు బాధ్యతను తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే నగర పాలక సంస్థతో కలిసి ప్లాస్టిక్ వాడకంతో ప్రమాదాలు, కాలుష్యం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని ఆయన తెలిపారు. అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కాగా కాలుష్య నియంత్రణ కోసం ఏటా వేయి మొక్కలు పంపిణీ చేయడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఎన్టీఆర్ నగర్‌లోని గణేష్ మిత్రమండలి అధ్యక్షుడు గాలి శ్రీధర్ తెలిపారు. తమ మిత్రమండలి ఏర్పాటు చేసినప్పటి నుంచి రక్తదాన శిబిరాలు, సామూహిక సేవాకార్యక్రమాలు, అన్నార్థులకు ఆర్థిక సహాయం వంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు.

కుల ధ్రువీకరణ పత్రం మంజూరుపై మహిళల ఆందోళన

● తహసీల్దారును నిలదీసిన మహిళలు

కలువాయి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కుల ధ్రువీకరణ పత్రం మంజూరు విషయమై స్థానిక తహసీల్దారు శ్యామ్‌సుందరాజును పలువురు మహిళలు నిలదీసిన సంఘటన బుధవారం తహసీల్దారు కార్యాలయంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కలువాయికి చెందిన రేపూరి యానాదయ్య మే నెల 20వ తేదీన ఎస్సీ (మాల) కుల ధ్రువీకరణ పత్రం కోసం తహసీల్దారుకు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే గ్రామానికి చెందిన కొందరు మహిళలు యానాదయ్య క్రిష్టియన్ మతం పుచ్చుకున్నాడని, అతనికి మంజూరు చేయవద్దని తహసీల్దారు దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం తహసీల్దారు యానాదయ్యకు ఎస్సీ (మాల) కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేశారు. ఈ విషయం తెలుసుకున్న మహిళలు తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని తహసీల్దారు శ్యామ్‌సుందరాజును నిలదీశారు. విచారణ చేయకుండా కుల ధ్రువీకరణ పత్రం ఎలా మంజూరు చేస్తారని వారు ప్రశ్నించారు. అనంతరం కార్యాలయం ముందు మహిళలు బైఠాయించి ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈవిషయమై తహసీల్దారు శ్యామ్ సుందరాజు మాట్లాడుతూ కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయకుండా నిలిపే అధికారం మీకు లేదు.. మంజూరు చేయండి.. దీనిపై అభ్యంతరాలు ఉన్నవారు నాకు దరఖాస్తు చేసుకుంటే విచారించి రద్దు చేస్తామని జాయింట్ కలెక్టర్ తమకు చెప్పారని తహసీల్దారు తెలిపారు.

జగనన్నా.. మాకు దిక్కు ఎవరన్నా?

- అల్లూరులో దుమారం రేపుతున్న ప్లెక్సీ
- వైసీపీ శ్రేణుల్లో తీవ్ర చర్చనీయాంశం



అల్లూరులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

జగనన్నా.. మాకు దిక్కు ఎవరన్నా..? ఈ మాట ఆ పార్టీకి చెందిన ఓ వర్గం వేయించిన ఫ్లెక్సీలో కనిపిస్తోంది. అల్లూరు వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో, రామకృష్ణ కళాశాల సెంటర్‌లో బుధవారం ఫ్లెక్సీలు వెలిశాయి. ఈ ఫ్లెక్సీల్లో ఈ వ్యాఖ్యలు రాసి ఉన్నాయి. కావలి నియోజకవర్గంలో వైసీపీకి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కానీ ఈ ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం వెనుక ప్రతాప్‌కుమార్‌రెడ్డి నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్న ఓ వర్గం తమ భావజాలాన్ని స్పష్టం చేస్తుందంటూ విశ్వసనీయ వర్గాలు అంటున్నాయి. ఈ అంశంపై స్థానికుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వైసీపీ నిరసన కార్యక్రమం చేపట్టిన రోజే ఈ ఫ్లెక్సీ ఏర్పాటు కావడంతో అల్లూరు వైసీపీ శ్రేణుల్లో ఇదొక సమస్యగా మారింది. దీనిపై కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి ఏం చర్యలు తీసుకోనున్నారో వేసి చూడాలంటూ స్థానికులు అంటున్నారు.

- అల్లూరు, (ఆంధ్రజ్యోతి)

కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల నిరసనలు

నెల్లూరు(క్రైం), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ డిపోల గ్యారేజ్ గేట్ల ఎదుట కార్మికులు నిరసనలు కొనసాగించారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అన్ని డిపోల ఎన్ఎం యూఏ అధ్యక్షులు, కార్యదర్శులు, గ్యారేజ్ అధ్యక్ష,కార్యదర్శులు తదితరు లు పాల్గొన్నారు.

హరితశోభితం.. గండిపాళెం గ్రామం



గండిపాళెం గ్రామంలో రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు

ఉదయగిరి మండలం గండిపాళెం గ్రామం రోడ్లకిరువైపులా పచ్చని చెట్లు ఏపుగా పెరగడంతో హరితశోభితం సంతరించుకొంది. గ్రామ దత్తత స్వీకర్త, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి సహకారంతో నాలుగేళ్ల క్రితం కడియం ప్రాంతం నుంచి ప్రత్యేకంగా 1,500 మొక్కలు తీసుకొచ్చారు. ఆ మొక్కలను గ్రామానికి ఇరువైపులా ఉన్న రహదారుల వెంట, ఎస్సీ, బీసీ కాలనీలు, పాఠశాలలు, వైద్యశాలలు, గురుకుల పాఠశాల ప్రాంతాల్లో నాటి ఇనుప కంచెలు ఏర్పాటు చేశారు. అనంతరం సిబ్బందిని ఏర్పాటు చేసి వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆ మొక్కలు ఏపుగా పెరగడంతో రోడ్ల వెంట రాకపోకలు సాగించే వారికి, గ్రామస్థులకు ఆహ్లాదకర వాతావరణం కలిగిస్తున్నాయి. ఇలా ప్రతిఒక్కరు పర్యావరణ పరిరక్షణకు పాటుపడితే వాయు, వాతావరణ కాలుష్యం తగ్గి సకాలంలో వర్షాలు కురిసి ప్రజలు ఆరోగ్యకరంగా ఉండేందుకు ఉపయుక్తంగా ఉంటుంది. - ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

ప్రమాదంలో పర్యావరణం

- నిబంధనలు పాటించని పరిశ్రమలెన్నో... • ఎటు చూసినా భవిష్యత్తు ఆందోళనకరమే
- తస్మాత్ జాగ్రత్త అంటున్న మేధావులు • నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం



పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన మానవులు దాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. ఆధునిక సాంకేతికత ముసుగులో పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నారు. ఫలితంగా అతివృష్టి.. అనావృష్టి ఏర్పడి మానవ మనుగడనే ప్రశ్నిస్తున్నాయి. పరిశ్రమల కాలుష్యం కారణంగా సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ లాంటి విష వాయువులు విడుదలవుతూ జీవుల మనుగడకే ముప్పులా మారాయి. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి 1972 నుంచి పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించింది. ఈ క్రమంలో ప్రతిఏటా జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకోవాలని తీర్మానించింది.

నెల్లూరు (వైద్యం), జూన్ 4(ఆంధ్రజ్యోతి): నెల్లూరుతోపాటు కావలి, ఆత్మకూరు, కందుకూరు పట్టణాల్లో వాయు కాలుష్యం ఎక్కువగా ఉంది. 2021లో పర్ క్యూబిక్ మీటరుకు 27 మైక్రోగ్రాములు కాలుష్యం ఉండగా, 2023లో 130 మైక్రోగ్రాములుగా ఉంది. ప్రస్తుతం 52 మైక్రోగ్రాములు వాయు కాలుష్యం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. సాధారణంగా 60 మైక్రోగ్రాములు ఉండాలి. అయితే జిల్లాలో వాయు కాలుష్యం పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశమే. కాగా జిల్లా పరిశ్రమలకు నిలయంగా మారుతోంది. ఒకప్పుడు కేవలం 10 లోపు పరిశ్రమలు ఉండగా,



కృష్ణపట్నంలో థర్మల్ పవర్ స్టేషన్లు వెదజల్లుతున్న కాలుష్యం



వాటిలో పర్యావరణ నిబంధనలు పాటించటంతో ఎలాంటి ముప్పు వాటిల్లలేదు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. తీరప్రాంతం మొత్తం పరిశ్రమల హబ్‌గా మారాయి. ముత్తుకూరు నుంచి రామయ్యపట్నం వరకు తీరం 80 కి.మీ విస్తరించి ఉంది.ఈ తీరంలో 13 కిలోమీటర్ల పరిధిలోనే పెద్దసంఖ్యలో థర్మల్ విద్యుత్ పరిశ్రమలు అందుబాటులోకి వచ్చాయి. ఆ పరిశ్రమల వల్ల 15 కిలోమీటర్ల పరిధిలో 2 నుంచి 5 వరకు డిగ్రీలు ఉష్ణోగ్రత పెరిగి పంటల దిగుబడి 30 శాతం తగ్గింది. థర్మల్ కేంద్రాల వేడి వల్ల సముద్రంలోని వేల టన్నుల రొయ్యలు, చేపలు చనిపోయి మత్స్యకారులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. ఇక వాహన కాలుష్యం వల్ల కాలుష్యం వెదజల్లబడి జీవజాతుల మనుగడ కష్టతరంగా మారుతోంది.

కాలుష్యం ఎక్కువగా ఉంది

జిల్లాలోని నగర, పట్టణాల్లో వాయు కాలుష్యం ఎక్కుగా ఉంది. సాధారణంగా క్యూబిక్ మీటరుకు 60 మైక్రోగ్రాములు కాలుష్యం ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 52కి చేరువులో ఉంది. ప్రతి పరిశ్రమలో 30 శాతం గ్రీన్ బెల్ట్ ఉండాలి. ఇందుకోసం మొక్కలు పెంచాలి. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలలో కూడా పర్యావరణంపై చైతన్యం తీసుకు వచ్చేలా కృషిచేస్తున్నాం.

- అశోక్‌కుమార్, కాలుష్య నియంత్రణశాఖ ఈఈ

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలి. పర్యావరణంపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. కుటుంబంలో ఒకరయినా ఓ మొక్కను నాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలి. ఇప్పటికే అనేక ప్రాంతాలలో పర్యావరణం దెబ్బతినటం వల్ల క్యాన్సర్, గుండెజబ్బులు, దగ్గు, ఆయాసం, ఉబ్బసం, ఊపిరితిత్తుల జబ్బులు, చర్మ వ్యాధులు వస్తున్నాయి. కాబట్టి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పర్యావరణాన్ని కాపాడాలి.

- డాక్టర్ కాలేషా సాహెబ్, జేవీవీ, జిల్లా అధ్యక్షుడు, జీజీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్

కాకాణితో వైసీపీ ఎంపీల ములాఖత్

11, 12 తేదీల్లో జగన్ నెల్లూరు రాక

నెల్లూరు (క్రైం), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు సెంట్రల్ జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో బుధవారం రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి ములాఖత్ అయ్యారు. అనంతరం మిధున్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 11, 12 తేదీల్లో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కాకాణిని పరామర్శించేందుకు నెల్లూరు సెంట్రల్ జైలుకు వస్తారని తెలిపారు. అక్రమంగా, అకారణంగా కాకాణిపై కేసులు పెట్టి జైలుకు పంపడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడం లేదని ప్రశ్నించడమే కాకాణి చేసిన తప్పన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నాయకులపై తప్పుడు కేసులు పెడుతూ ఏదో జరిగిపోతుందని, భయభ్రాంతులకు గురిచేయడం సరైన పద్ధతి కాదన్నారు. కాకాణి జైల్లో ఎంతో ధైర్యంగా ఉన్నారని , ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా భయపడేది లేదని ఆయన చెప్పారు. త్వరలోనే ఆయన జైలు నుంచి బయటకు వస్తారని ఆశిస్తున్నామన్నారు.



కసుమూరు దర్గాలో సంగీత దర్శకుడు 'కోటి'

వెంకటాచలం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక కసుమూరు మస్తాన్ వలి దర్గాను మంగళవారం రాత్రి తెలుగు చలనచిత్ర సంగీత దర్శకుడు కోటి సందర్శించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆయనకు దర్గా ముజావర్లు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. కొద్దిసేపు దర్గాలో కూర్చుని ప్రార్థనలు చేశారు. ఆయన వెంట దర్గా ముజావర్లు ఎంఎస్ మొహ్మద్, ఎంఎస్ మున్నా తదితరులున్నారు.

సంగీతంలో రాజు

కోయిల గానంలా తన వేణువుతో గీతాలను ఆలపిస్తాడు. కీబోర్డుతో సప్తస్వరాలు పలికించడమేకాదు.. ఎంతోమంది సంగీతప్రియులకు ఫ్లూట్, కీబోర్డు, గాత్ర సంగీతంపై శిక్షణ ఇస్తూ వేణుగాన మురళీమోహనుడుగా పేరుగడించాడు. నిరుపేద కుటుంబంలో జన్మించినా తన వేణుగానంతో ఎంతో మంది ప్రముఖుల చేత అవార్డులు, సన్మానాలు, సత్కారాలు పొంది కళామతల్లి ముద్దుబిడ్డగా సంగీత ప్రియులకు రాజా మాస్టర్‌గా ఎదిగాడు రావూరి గోవిందరాజు.



- పేద కుటుంబంలో జన్మించినా వేణుగానమే ఊపిరిగా..
- ఫ్లూట్, కీబోర్డు, గాత్ర సంగీతంపై పలువురికి శిక్షణ
- ఎందరో ప్రముఖుల నుండి అవార్డులు, సన్మానాలు.

కావలి రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కావలిలోని జనతాపేటలో ఉంటున్న గోవిందరాజు చిన్నప్పుడే వేణుగానంపై ఆసక్తి పెంచుకున్నాడు. తమిళనాడుకు చెందిన చిన్నయ్య, పాపమ్మ దంపతులకు ముగ్గురు సంతానంలో రెండవ కుమారుడు గోవిందరాజు. జీవనోపాధి కోసం గోవిందరాజు కుటుంబం తమిళనాడు నుంచి విజయవాడకు వలస వచ్చింది ఎస్ఎస్ఎల్‌సి వరకు చదివిన గోవిందరాజుకు చిన్నతనం నుంచి సంగీతంపై ఉన్న ఆసక్తిని గుర్తించిన తల్లిదండ్రుల ప్రోత్సాహం దక్కింది.

శంకరాభరణం సినిమాతో..

శంకరాభరణం సినిమాతో సంగీతంపై మరింత మక్కువ పెంచుకున్న గోవిందరాజు విజయవాడలోని కోటేశ్వరరావు మ్యూజికల్ కళాశాలలో బ్రహ్మానందం, సుభద్ర గురువుల వద్ద నాలుగేళ్లపాటు గాత్ర సంగీతంపై శిక్షణ పొందారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పండిట్ హరిప్రసాద్ చౌరాసియా ప్రదర్శనల వీడియోలను ఆదర్శంగా తీసుకుని ఫ్లూట్ మాస్టర్ కోటేశ్వరరావు వద్ద మూడేళ్లపాటు వేణుగానంపై శిక్షణ తీసుకున్నారు. విజయవాడలోని ఓ షమార్డులో పనిచేస్తూనే గాత్ర సంగీతం ఆధారంగా కీబోర్డులో సప్తస్వరాలు పలికిస్తూ తనకు తానే సాటి అనిపించుకుంటున్నారు.

ఎన్నో అవార్డులు, సన్మానాలు

తెలుగు, తమిళ, హిందీ భాషల్లో వెయ్యి పాటలకుపైగా గానం చేసి ఫ్లూట్, కీబోర్డు వాయిద్యాలతో ఎందరో ప్రముఖుల నుంచి అవార్డులు, సన్మానాలను అందుకున్నారు. అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత తదితర ప్రముఖుల చేతులమీదుగా అనేక అవార్డులు, బహుమతులు తీసుకున్నారు.

కళావతి మ్యూజికల్ స్కూల్ ఏర్పాటు

నిరుపేద అయిన గోవిందరాజు బతుకుజీవుడా అంటూ పొట్టకూటి కోసం సుమారు 20 సంవత్సరాల క్రితం కావలి వలస వచ్చాడు. ఓ ప్రైవేటు కళాశాలలో రెండేళ్లపాటు సంగీతం మాస్టర్‌గా పనిచేశాడు. ఆ తర్వాత ఒక ప్రైవేటు కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేశాడు. కళాకారుడిగా పేరు తెచ్చుకున్నా నిత్య విద్యార్థిలా నిరంతరం కఠోర శ్రమ తో నూతన ఒరవడికలను సృష్టిస్తున్నారు. శాస్త్రీయసంగీతం ఆధారంగా అన్నమాచార్య కీర్తనలు, సినీ మధురగీతాలు, క్రైస్తవ భక్తిగీతాలను ఆలపిస్తున్నారు. సంవత్సర కాలం పట్టే మ్యూజిక్ కోర్సులను 6 నెలల్లో సంగీత ప్రియులకు నేర్పిస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు.





కీబోర్డు, ఫ్లూట్ వాయిద్యాలలో శిక్షణ ఇస్తున్న గోవిందరాజు


ఆ డబ్బులు ఎక్కడివి.. ఎవరివి!?

- బీజీసీ క్యాపిటల్ ట్రేడింగ్‌లో రూ.80 లక్షల గల్లంతు
- బాధితుడు ఓ రాజకీయ నాయకుడి వద్ద గుమాస్తా
- అన్ని కోణాల్లో పోలీసుల దర్యాప్తు

నెల్లూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): బీజీసీ క్యాపిటల్ అనే బోగస్ ట్రేడింగ్ ప్లాట్‌ఫాంలో లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి జి.మస్తాన్ అనే వ్యక్తి మోసపోయాడు. దీనిపై మార్చిలో సైబర్ క్రైంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ దర్యాప్తు రెండు కోణాల్లో జరుగుతున్నట్లు సమాచారం. మోసం చేసిన బోగస్ ట్రేడింగ్ ప్లాట్‌ఫాంతోపాటు ఇంత డబ్బులు బాదితుడికి ఎలా వచ్చాయి, నిజంగా ఆ డబ్బులు ఆయనవేనా, లేక మరెవరికైనా బినామీగా వ్యవహరించారా!? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. వెంకటాచలం మండలానికి చెందిన జి.మస్తాన్ ఒక మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత ప్రసన్న కుమార్ రెడ్డి వద్ద కొంతకాలం గుమాస్తాగా పనిచేశారు. అధిక లాభాలు వస్తాయన్న ఆశతో బీజీసీ అనే ట్రేడింగ్ ఆన్‌లైన్ యాప్‌లో మస్తాన్ పెట్టుబడి పెట్టారు. 2024, డిసెంబరు నుంచి 2025, మార్చి వరకు దశల వారీగా పెట్టుబడి పెడుతూ వచ్చారు. మార్చి 8వ తేదీ వరకు ఈ ట్రేడింగ్ యాప్‌లో 80 లక్షలకు పైగా పెట్టుబడులు పెట్టారు. డబ్బులు పెట్టడమే తప్ప తిరిగి రాకపోవడంతో సైబర్ పోలీసులను ఆశ్రయించారు. అప్పట్లోనే సైబర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ కేసు రెండు వైపుల నుంచి దర్యాప్తు జరుపుతున్నట్లు సమాచారం. ఒక సాధారణ వ్యక్తి కేవలం మూడు నెలల్లో రూ.80 లక్షలు ఎలా పెట్టుబడిగా పెట్టగలిగారు, ఆ డబ్బులు ఇతనివేనా లేదా మరెవరికైనా బినామీగా వ్యవహరించారా..!? అనే కోణంలో దర్యాప్తు మొదలైనట్లు తెలిసింది.

రూ. 43 వేల కోట్లు దోచేసిన జగన్

- దొంగల పార్టీగా వైసీపీ
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



నెల్లూరు (వైద్యం) జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ దొంగల పార్టీగా మారిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. కృష్ణపట్నం ఆనందయ్య ఆయుర్వేద మందు కేసుకు సంబంధించి నెల్లూరు రైల్వేకోర్టులో బుధవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. జగన్ అధికారంలో ఉండగా తనపై అక్రమంగా 18 కేసులు పెట్టారన్నారు. జగన్మోహన్‌రెడ్డి వెన్నుపోటుదినంగా నిర్వహించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. వెన్నుపోటు అనే పేరు ఎత్తే అర్హత వైసీపీకి లేదని ఎద్దేవా చేశారు. తన తండ్రి రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ. 43 వేల కోట్ల అవినీతికి పాల్పడిన ముద్దాయిగా జగన్మోహన్‌రెడ్డి ఉన్నారని ఆరోపించారు. ఒక్కఛాన్సు అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ ఏపీ ప్రజలను వెన్నుపోటు పొడిచారన్నారు. కల్తీ మద్యం పోసి వేలాది మంది ప్రాణాలు బలితీసుకున్నాడని, లక్షల మంది మంచానికే పరిమితమయ్యారని విమర్శించారు. సిట్ విచారణలో ఇప్పటి వరకు లిక్కర్ స్కామ్ రూ. 3,200 కోట్లు అని తేల్చారన్నారు. చివరకు గంజాయి బ్యాచ్ రౌడీషీటర్లను పరామర్శించి ప్రజలకు ఏమి సందేశం ఇస్తారని జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత పార్టీ ఎంపీ రఘురామకృష్ణరాజును పోలీసులతో 121 దెబ్బలు కొట్టించి దీన్ని వీడియో కాల్‌లో చూసి ఆనందించిన సైకో జగన్ అన్నారు. వైసీపీ హయాంలో చచ్చిపోయిన ప్రజాస్వామ్యాన్ని సర్వనాశనమైతే ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ గాడిలో పెడుతున్నారని సోమిరెడ్డి తెలిపారు.

భానుడి ప్రకోపం...
పక్షులకేమో తాపం

రెండురోజులుగా భానుడు భగభగ నిప్పులు కక్కుతున్నాడు. తన ప్రకోపాన్ని రోహిణికార్తె ప్రారంభంలో చూపకపోయినా బుధవారం జనాలకు చమటలు పట్టించాడు. జనాలతోపాటు భానుడి వేడికి పక్షులు తట్టుకోలేకపోతున్నాయి. ఎక్కడ నీరు దొరుకుతుందోనని పరుగులు తీస్తున్నాయి. బుధవారం మనుబోలు సచివాలయం-2 వద్ద వృథాగా పోతున్న నీటిధార కాకులు, పావురాలు గుర్తించి దాహార్తి తీర్చుకున్నాయి.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)



ఈ నీటిని ఎలా తాగలబ్బా ... ఆలోచిస్తున్న పావురాలు



పైపులోంచి వచ్చే నీటిని తాగుతున్న కాకి

బాలు చనిపోలేదు.. అందరి హృదయాల్లో ఉన్నారు!

- బాలు అవార్డు గ్రహీత, సినీ గేయని రమణ

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం భౌతికంగా దూరమైనా పాట, మాట, చిత్రాల ద్వారా మన అందరి హృదయాల్లో చిరంజీవిగా ఉన్నారని జాతీయస్థాయి బాలు అవార్డు గ్రహీత, మధుర గాయని బీ. రమణ అన్నారు.బుధవారం రాత్రి నగరంలోని పురమందిరంలో పద్మవిభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి వేడుకలు జరిగాయి. బాలు అవార్డు అందుకున్న రమణ మాట్లాడుతూ తాను, బాలు 1963లో ఆంధ్రా క్లబ్ చెన్నైలో లలిత సంగీత పోటీల్లో పాల్గొన్నామని, అప్పటి నుంచి ఆయనతో పరిచయమని తెలిపారు.ఆయనతో వేలాది సంగీత కచేరీలు, పలు చలనచిత్రాలలో పాటలు పాడానని తెలిపారు. ఆయనతో కలిసి పాటలు పాడాలంటే అంతా చాలా భయపడేవారమని తెలిపారు. ఆయన వద్ద గాయకులు ఎంతో నేర్చుకున్నారని తెలిపారు. 2020లో ఆయన మరణవార్త విని ప్రపంచమే మూగబోయిందని, ఆయన గురించి ఇక ఏమని మాట్లాడగలనని తెలిపారు. సినీ నటుడు శుభలేక సుధాకర్ మాట్లాడుతూ బాలును అభిమానులు ఎన్నో పేర్లతో పిలుస్తారని, తాను మాత్రం అప్పటికీ, ఇప్పటికీ సార్.. అని పిలుస్తానని తెలిపారు. బాలు పేరుమీద ఆయన జయంతి రోజున ఇచ్చే జాతీయ అవార్డుకు తాను, తన సతీమణి శైలజ బాధ్యతగా హాజరవుతామని తెలిపారు. బాలసుబ్రహ్మణ్యం సోదరి ఎస్పీ శైలజ మాట్లాడుతూ అన్న బాలసుబ్రహ్మణ్యంతో కలిసి పాటలు పాడే అవకాశం తనకు సన్మాన గ్రహీత బీ.రమణ ద్వారానే అవకాశం వచ్చిందన్నారు. రమణకు పురస్కారం ఇచ్చినందుకు ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక వారు నిర్వహించించారు. ఈ సందర్భంగా చిన్నారుల సంగీత విభావరి ఆకట్టుకుంది. కార్యక్రమంలో మావూరి శ్రీనివాసరావు, మద్దాళి రఘురామ్, ఎంవీ నారాయణ మూర్తి, వీరిశెట్టి హజరత్ బాబు, ఎన్.బలరామయ్య నాయుడు, జీవీ మురళీ, తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని చేతన కార్యవర్గం వై.శేషగిరీశం, డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, బెనర్జీ, ఎస్.సుబ్బారావు, ఆదిశేషు, వైవీ.విశ్వనాథం, నారాయణ స్వామి, తదితరులు పర్యవేక్షించారు.

నేడు పెన్షన్, జీపీఎఫ్ అదాలత్

వింజమూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పెన్షన్, జీపీఎఫ్ సమస్యల పరిష్కారం కోసం గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అదాలత్ జరుగుతుందని రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతిప్రియ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పెన్షన్, జీపీఎఫ్ కేసులు సమీక్షించి అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని పెన్షనర్లు, అధికారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9363
వెండి కిలో ధర	రూ. 104100
వెండి ఒక గ్రాము	రూ. 107.10



గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి

● రామచంద్రయ్య ఇన్‌చార్జి ఎంపీడీవో

అనంతసాగరం జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రతేక దృష్టి సారించామని, కార్యదర్శులు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రామ చంద్రయ్య తెలిపారు.

? యోగాంధ్ర నిర్వాహణ ఎలా జరుగుతోంది

! మండలంలో అధికారులను మూడు క్లస్టర్లుగా విభజించి వారికి యోగాపై ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించేలా ప్రణాళిక చేశాం

? మేజర్ పంచాయతీ అనంతసాగరంలో కొన్ని వీధుల్లో లైట్లు లేవు. ఏర్పాటుచేస్తారా.

! వీధిదీపాలు వేయించేలా చర్యలు తీసుకొంటాం. ప్రజలు ఇబ్బందులు పడకుండా చూస్తాం.

? మౌలిక వసతుల కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు

! ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి గ్రామాల్లో సమస్యలు గుర్తించి పరిష్కరించాలని ఆదేశించాం.

? గ్రామాల్లో ఉపాధి పనులు ఎలా జరుగ తున్నాయి.

! జాతీయ గ్రామీణ ఉపాధి పనులు అన్ని గ్రామాల్లో జరిగేలా చూస్తున్నాం. అవకతవకలు జరుగకుండా తనిఖీలు చేస్తాం.

న్యూస్ బాక్స్

సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికుల ఆందోళన



డిపో ఎదుట నిరసన చేస్తున్న కార్మికులు

ఉదయగిరి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ జోనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ సలాం, డిపో అధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జిల్లా కమిటీ పిలుపు మేరకు బుధవారం తెల్లవారుజామున స్థానిక డిపో ఎదుట ఎర్ర బ్యాడ్జీలు ధరించి ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిపో, గ్యారేజీలో కార్మికుల పట్ల పక్షపాతి వైఖరి విడనాడాలన్నారు. పని వత్తిడిపై విచారణ చేపట్టాలన్నారు. కార్మికులు పెట్టుకునే సిక్ లీవ్‌లకు జీతాలు ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు శివకుమార్, శంకర్, కుమార్, కాంతమ్మ, అల్లూరురాజు, శ్రీను, ఏడుకొండలు సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 41.430 టీఎంసీల నీరు

అనంతసాగరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా బుధవారం నాటికి 41.430 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో 346 క్యూసెక్కులు వస్తుండగా పెన్నా డెల్టాకు 3,150, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

బాణసంచా కాల్చడంపై కేసు నమోదు

ఉదయగిరి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా బాణసంచా కాల్చిన షేక్ ఖాజాపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి బుధవారం తెలిపారు.

పెళ్లి కానుక అందజేత

ఉదయగిరి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గండిపాళెం మార్గంలోని క్రిష్టియన్ పాళెంలో బండారి బాబురావు, గురవమ్మల కుమార్తె ఎస్తేరు వివాహం సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచన మేరకు టీడీపీ నాయకులు బుధవారం కాకర్ల ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10 వేలు పెళ్లి కానుక అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, గడ్డం వెంకటేశ్వర్లు, నరసింహ, మతకాల శ్రీనివాసులయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాత్రి బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు



నెల్లూరుపాళెం సెంటర్‌లో బస్సు దిగుతున్న ప్రయాణికులు



ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

ఆత్మకూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళల్లో ఆర్టీసీ బస్సు సర్వీసులు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఆత్మకూరు పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ ఉంది. దాంతో పాటు రూ. 4.5 కోట్లతో పాత మున్సిపల్ బస్టాండ్ అందుబాటులోకి వచ్చింది. కానీ గత కొన్నేళ్లుగా ఆత్మకూరు పట్టణంలోకి రాత్రిపూట కొన్ని ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రాత్రి బస్సు సర్వీసులను ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్ వరకు నడపాలని గతంలో పలుమార్లు నెల్లూరు ఆర్టీసీ అధికారులు కర్నూలు, కడప డిపో అధికారులకు ప్రతిపాదనలు పంపారు. అయితే వారి ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. పొద్దుటూరు, అనంతపురం, కడప, కర్నూలు, పులివెందుల, బళ్లారి తదితర ప్రాంతాల నుంచి రాత్రిపూట సుమారు 10 ఆర్టీసీ బస్సులు తిరుగుతాయి. ఆ బస్సులన్నీ నెల్లూరుపాళెం సెంటర్‌లోనే ప్రయాణికులను దించేసి వెళ్లిపోతుంటాయి. ఈ బస్సులు నెల్లూరుపాళెం సెంటర్‌కు చేరేసరికి రాత్రి 11 నుంచి ఒంటి గంట దాటుతుంది. దాంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం. ఆ సమయంలో నెల్లూరుపాళెం సెంటర్‌లో ఆటోలు ఉంటే వాటిని ఆశ్రయిస్తారు. లేదంటే కాళ్లకు పని చెప్పాల్సి వస్తోంది. ఈ క్రమంలో ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, వ్యాపారులు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. కాగా, బైపాస్ రైడర్ల పేరుతో ఆర్టీసీ ఆత్మకూరులోకి బస్సులు నడపడం లేదు. పగటిపూట సైతం నెల్లూరుపాళెంసెంటర్‌లోనే ప్రయాణికులను దించేసి వెళుతున్నాయి. ఆత్మకూరు డిపో నుంచి నెల్లూరుకు బస్సులు ఉన్నాయి కదా అంటూ ఆర్టీసీ అధికారులు తప్పించుకుంటున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి కనీసం రాత్రి సర్వీసులను ఆత్మకూరు ఆర్టీసీ డిపో వరకు వచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వ్యవసాయాధికారుల సూచన మేరకే ఎరువులు వాడాలి



బసినేనిపల్లిలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డా. నాగేశ్వరరావు

ఉదయగిరి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అధికారుల సూచన మేరకే రైతులు తమ పంట పొలాలకు ఎరువులు, పురుగుమందులు వాడాలని నెల్లూరు వరి ప్రధాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త వినీత సూచించారు. బుధవారం మండలంలోని కృష్ణంపల్లి రైతుసేవా కేంద్రంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షలు, కొత్తరకం వంగడాలు, ఎరువుల యాజమాన్యం, పచ్చిరొట్ట విత్తనాల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. వివిధ పంటల్లో వచ్చే కలుపు నివారణ చర్యలను సూచించారు. అలాగే మత్స్య పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త హరిసాధు, ఏఈవో రాజశేఖర్‌రెడ్డి, వీఏఏలు చల్లా పూజిత, అనీఫా, స్రవంతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్): ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్తలు లక్ష్మిప్రసన్న, శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం జీ.కొండారెడ్డిపల్లిలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూసార పరీక్షల ఫలితాలకు అనుగుణంగా అనువైన పంటలను ఎంపిక చేసుకోవాలన్నారు. ఎరువుల వినియోగం, జీవన ఎరువుల ప్రాముఖ్యత, తెగుళ్ల యాజమాన్య పద్ధతులు, వరి విత్తన రకాలు, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం రైతుల నుంచి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో విస్తరణ విభాగం శాస్త్రవేత్త లోకేష్‌బాబు, వ్యవసాయాధికారులు చక్రవర్తి, రవికుమార్, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

సీతారామపురం: మండల పరిధిలోని బసినేనిపల్లి గ్రామంలో కృషివిజ్ఞాన కేంద్రం నెల్లూరు వారి ఆధ్వర్యంలో బుధవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. నాగేశ్వరరావు, శాస్త్రవేత్త డా. ప్రసన్న రాజేష్ మాట్లాడుతూ భూసార పరీక్షలు, ఆధునిక వ్యవసాయ పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకొని తదనుగుణంగా ఎరువుల యాజమాన్యం పాటించాలని సూచించారు. విత్తనోత్పత్తి, మినుము, పెసర సాగులో మెళకువలను వివరించారు. రైతులకు నువ్వుల పంటకు సంబంధించిన కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా. విజయ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేతల సంబరాలు



కలువాయి బస్టాండులో కేక్ కట్ చేస్తున్న జనసేన పార్టీ నాయకులు

కలువాయి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పట్టిన పీడ విరగడై ఏడాది అయిన సందర్భంగా బుధవారం సాయంత్రం స్థానిక బస్టాండు సెంటర్‌లో జనసేన నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల అరాచక పాలనను ప్రజలు ఓటు హక్కుతో తరిమికొట్టారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పెరంకొండ మనోహర్, మలే హరిప్రసాద్, సుంకు రామకృష్ణా, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన వీర మహిళలకు ముగ్గుల పోటీ



పోటీల్లో పాల్గొని ముగ్గులు వేస్తున్న వీర మహిళలు

సంగం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం సంగంలోని తూర్పువీధిలో ఆత్మకూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి శ్రీధర్ ఆధ్వర్యంలో జనసేన వీర మహిళలకు బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ సందర్శనకు టీటీడీ చైర్మన్‌కు ఆహ్వానం



టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును ఆహ్వానిస్తున్న ఆలయ ధర్మకర్తలు పెండ్యాల దంపతులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైకుంఠపురంలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుతో పాటు మాజీ ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యానాయుడును ఆలయ ధర్మకర్తలు పెండ్యాల సూర్యనారాయణ, అమ్మాజీ దంపతులు ఆహ్వానించారు. బుధవారం హైదరాబాదులోని వారి నివాసాల్లో మర్యాద పూర్వకంగా కలిసి నర్రవాడలో జరుగనున్న వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు హాజరు కానున్న నేపథ్యంలో మార్గమధ్యంలోని జాతీయ రహదారిలో ఉన్న తమ ఆలయాన్ని సైతం సందర్శించాలని వారు కోరారు. ఈసందర్భంగా సానుకూలంగా స్పందించిన ఇరువురూ తప్పకుండా హాజరవుతామని హామీ ఇచ్చారన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



ఆత్మకూరు: ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం ఇస్తున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి



ఉదయగిరి: కార్యకర్తలతో ర్యాలీ నిర్వహిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఆత్మకూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఆత్మకూరు పట్టణంలో వైసీపీ శ్రేణులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ముందుగా మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆర్డీవో కార్యాలయ నిర్వహణ అధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, రాష్ట్ర మున్సిపల్ విభాగ సెక్రటరీ అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జిల్లా ఉపా ధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, ఆయా మండలాల కన్వీనర్లు, వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

● ఉదయగిరి: వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక వైఎస్‌ఆర్ సర్కిల్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజ శేఖర్‌రెడ్డి విగ్రహానికి ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు షాజియాకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు గణపం బాలకృష్ణారెడ్డి, అలీ అహ్మద్, ఓబులరెడ్డి, మూలె వినయ్‌రెడ్డి, ఎల్‌వీ మాలకొండారెడ్డి, వాసుదేవరెడ్డి, రవీంద్ర, తిరుపతి నాయుడు, ఎనిమిది మండలాల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రం మంజూరుపై మహిళల నిరసన



తహసీల్దారును నిలదీస్తున్న మహిళలు.

కలువాయి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కుల ధ్రువీకరణ పత్రం మంజూరు విషయమై స్థానిక తహసీల్దారు శ్యామ్‌సుందరరాజును పలువురు మహిళలు నిలదీసిన సంఘటన బుధవారం తహసీల్దారు కార్యాలయంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కలువాయికి చెందిన రేపూరి యానాదయ్య మే నెల 20వ తేదీన ఎస్సీ (మాల) కుల ధ్రువీకరణ పత్రం కోసం తహసీల్దారుకు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే గ్రామానికి చెందిన కొందరు మహిళలు యానాదయ్య క్రిష్టియన్ మతం పుచ్చుకున్నాడని, అతనికి మంజూరు చేయవద్దని తహసీల్దారు దృష్టికి తీసుకువచ్చారు. ఈనేపథ్యంలో బుధవారం తహసీల్దారు యానాదయ్యకు ఎస్సీ (మాల) కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేశారు. ఈ విషయం తెలుసుకున్న మహిళలు తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని తహసీల్దారు శ్యామ్‌సుందరరాజును నిలదీశారు. విచారణ చేయకుండా కుల ధ్రువీకరణ పత్రం ఎలా మంజూరు చేస్తారని వారు ప్రశ్నించారు. అనంతరం కార్యాలయం ముందు మహిళలు బైఠాయించి ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తహసీల్దారు వివరణ

ఈవిషయమై తహసీల్దారు శ్యామ్ సుందరాజు మాట్లాడుతూ కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయకుండా నిలిపే అధికారం మీకు లేదు.. మంజూరు చేయండి... దీనిపై అభ్యంతరాలు ఉన్నవారు నాకు దరఖాస్తు చేసుకుంటే విచారించి రద్దు చేస్తామని జాయింట్ కలెక్టర్ తమకు చెప్పారని, దీంతో తాను సర్టిఫికెట్ మంజూరు చేసినట్లు తహసీల్దారు మహిళలకు తెలిపారు.

వెంకటాచలంలో భారీగా గంజాయి పట్టివేత

వెంకటాచలం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వెంకటాచలం సమీపంలో ఉన్న టోల్‌ప్లాజా వద్ద బుధవారం రాత్రి ఎక్సైజ్ అధికారులు జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా ఓ వాహనంలో భారీగా తరలుతున్న గంజాయిని పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆ గంజాయిని నెల్లూరు - 2 ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించినట్లు తెలుస్తోంది. పట్టుబడిన గంజాయి ఎన్ని కిలోలు, దాని విలువ, ఎక్కడి నుంచి తరలిస్తున్నారన్న పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

C.R.I.M.E N.E.W.S

ఇద్దరు దొంగల అరెస్టు

● 10 మోటార్ సైకిళ్ల స్వాధీనం



పట్టుబడిన దొంగలతో వివరాలు వెల్లడిస్తున్న సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ. శివరాకేష్

మనుబోలు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడడం..నేరాలు చేసి జైలు కెళ్లడం..బెయిల్‌పై రావడం...మరల చోరీలు చేయడం ఆ యువకులకు అలవాటుగా మారింది. మనుబోలు, తదితర ప్రాంతాల్లో గడిచిన నాలుగునెలల్లో మోటార్ సైకిళ్ళు దొంగతనాలు చేస్తూ పోలీసులకు చుక్కలు చూపించారు. చివరకు మనుబోలు పోలీసులకు మంగళవారం చిక్కి ఊచలు లెక్కబెడుతున్నారు. పోలీసులు తమదైన శైలిలో వారిని విచారించి దొంగతనాలు చేసిన పది మోటార్‌సైకిళ్ళను రికవరీ చేశారు. దీనిపై బుధవారం పొదలకూరు సీఐ శివరామకృష్ణారెడ్డి పీఎస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మండలంలోని పిడూరు గ్రామానికి చెందిన యల్లంటి మౌళి అలియాస్ మౌళికృష్ణ గతంలో పలు చోరీలు చేసి జైలుకెళ్ళాడు. ఇదే తరహాలో కావలి రూరల్‌లోని బుడంగుంట కాలనీకి చెందిన షేక్ కలీం నేరాలు చేసి జైలు కెళ్ళాడు. వీరిద్దరికీ జైలులో సావాసం కుదిరింది. ఫిబ్రవరిలో బెయిల్‌పై ఇద్దరూ బయట కొచ్చారు. అప్పటినుంచి మరల చోరీలు చేయడం ఆరంభించారు. మనుబోలులో 7 మోటార్‌సైకిళ్లు, గూడూరు పట్టణం, కొడవలూరు, ఇందుకూరుపేటలో ఒక్కొక్కటి కలిపి మొత్తం పది మోటార్‌సైకిళ్ళు చోరీచేశారు. రాత్రి సమయంలో ఇంటిబయట, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న మోటార్‌సైకిళ్ళు గుర్తించడం, వాటిని మారుతాళాలు పెట్టి తీసి తస్కరించడం వీరికి వెన్నతోపెట్టిన విద్య. ఇలా చోరీచేసిన మోటార్‌సైకిళ్లను రెండు ప్రాంతాల్లో దాచి ఉంచారు. ఆరు మోటార్‌సైకిళ్ళు మౌళీ ఒక్కడే చోరీచేయగా, నాలుగు మోటార్‌సైకిళ్ళు ఇద్దరూ కలిసి దొంగిలించారు. ఈ నేపథ్యంలో మంగళవారం వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఎస్‌ఐ శివరాకేష్ వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు యువకులు మోటార్‌సైకిళ్ళపై అటుఇటు తిరుగుతుండగా పోలీసులకు అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ కాబడిన మోటార్‌సైకిళ్ల వివరాలు వెలుగులోకి వచ్చాయి. చోరీచేసిన మోటార్‌సైకిళ్ళను దాచిఉంచిన ప్రాంతం నుంచి తీసుకువచ్చి స్టేషన్‌లో ఉంచారు. వీటి విలువ రూ. 3లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. ఇద్దరు నేరస్తులను అరెస్టు చేసి గూడూరు కోర్టుకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరచిన మనుబోలు ఎస్‌ఐ, సిబ్బందికి సీఐ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

పేకాట స్థావరంపై దాడి

● ఆరుగురి అరెస్టు ● రూ.1.6లక్షల స్వాధీనం

ఏఎస్ పేట, జూన్4 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై దాడిచేసి ఆరుగురిని అదుపులోకి తిసుకున్నట్లు ఏఎస్ పేట ఎస్‌ఐ సైదులు బుధవారం తెలిపారు. మండలంలోని జువ్వలగుంట పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో తన సిబ్బందితో కలసి దాడిచేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 1,60,890 రూపాయల నగదు, 5 సెల్ ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పేకాట ఆడడం, చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేపడితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇంట్లో చోరీ

నెల్లూరు(క్రైం), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు.ఈ ఘటన నగరంలోని బీవీనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు, బీవీనగర్ ఎల్‌ఐసీ కాలనీలో రవిశంకర్‌రెడ్డి నివాసం ఉంటున్నారు. ఆయన కటుంబసభ్యులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఆయన ఈనెల 3న రాత్రి పైగదిలో నిద్రపోయారు. కింద గదిలో పనిమనిషి నిద్రపోయింది. బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు కిటికీ గ్రీల్స్‌ను తొలగించి లోపలికి ప్రవేశించారు. బీరువాలోని 25 గ్రాముల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉదయగిరిలో..

ఉదయగిరి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలాజీ నగర్‌లో గుర్తుతెలియని వ్యక్తి చోరీకి పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మద్దా రవికుమార్ నివాసంలోకి అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ప్రవేశించి కబోర్డులో ఉంచిన రూ. 12వేల నగదు, రెండు సవర్ల బంగారు ఆభరణాలను చోరీచేశాడు. ఉదయం చోరీ జరిగిందని గుర్తించిన రవికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి బుధవారం తెలిపారు.

ఘర్షణపై కేసు నమోదు

ఉదయగిరి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శకునాలపల్లి పంచాయతీ బోడబండ గ్రామంలో ఇరు కుటుంబీకుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి బుధవారం తెలిపారు. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కావ్య కుమార్తె ప్రణీత తన బంధువైన ప్రశాంతి దగ్గరకు వెళ్లి వివాహ విషయంపై మాట్లాడింది. దీంతో ఇరు కుటుంబాల మధ్య వివాదం చోటుచేసుకొని ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనకు సంబంధించి ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 12 మందిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

వ్యభిచార కేంద్రంపై దాడులు

● ముగ్గురి అరెస్ట్

నెల్లూరు(క్రైం), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆర్టీవో కార్యాలయం సమీపంలో ఇళ్లమధ్యలో నిర్వహిస్తున్న వ్యభిచార కేంద్రంపై వేదాయపాలెం పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి ఈ దాడులు చేశారు. నిర్వాహకురాలు శివరంజినితోపాటు మనోహర్, జయరామయ్యను అరెస్ట్ చేశారు. సెక్స్ వర్కర్‌ను హోమ్‌కు తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని తిక్కనపార్కు సమీపంలోని జాఫర్‌సాహెబ్ కాలువ వద్ద గుర్తుతెలియని(60) వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, సంతపేట పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ బాలకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. వృద్ధుడు మూడు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని తెలుస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	127
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 525

» కలిగిరి నుంచి వలేటివారిపాలెం వరకు 45 కి.మీ డబుల్‌రోడ్డుకు ప్రతిపాదనలు
» తొలివిడతలో కలిగిరి నుంచి కొండాపురం వరకు 19.6 కిలోమీటర్లకు ప్రభుత్వం ఆమోదం
» పనులు ప్రారంభం, ప్రజలు, వాహనచోదకుల హర్షం

మెట్ట ప్రాంతవాసుల కల సాకారం!


రహదారి పనుల కోసం ఏర్పాటు చేసిన పైలాన్

కొండాపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి నియోజకవర్గంలోని మెట్ట ప్రాంత వాసుల కల ఎట్టకేలకు సాకారమవుతోంది. కలిగిరి మండలం నుంచి కొండాపురం మీదుగా కందుకూరు నియోజకవర్గంలోని వలేటివారిపాలెం మండలం వరకు సుమారు 45 కిలోమీటర్ల దూరం 17 ప్రధాన గ్రామాలను కలుపుతూ రెండు లేన్ల రహదారి నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. అయితే మొదటి విడతలో కలిగిరి మండలం నుంచి కొండాపురం మండలంలోకి సుమారు 19.6 కిలోమీటర్ల దూరం రెండు లేన్ల రహదారికి సుమారు రూ.30 కోట్ల మంజూరయ్యాయి. వాస్తవానికి ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందిందంటే అక్కడ రహదారి సదుపాయాలు బాగున్నట్లేనని నిర్ధారించుకోవాలి. రవాణా సదుపాయాలు అభివృద్ధి చెందకపోతే మండలం కూడా అభివృద్ధికి నోచుకోదు. ఈ పరిస్థితుల్లో కొండాపురం మీదుగా మరో రెండు మండలాలను కలుపుతూ రెండు లేన్ల రహదారి మంజూరవ్వడం, ఈ పనులకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శంకుస్థాపన చేయడంతో అటు రైతులు ఇటు మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కలిగిరి నుంచి వలేటివారిపాలెం సుమారు 45 కిలోమీటర్ల దూరం ఉంది. జిల్లా కేంద్రం నెల్లూరుకి దాదాపు 90 కిలోమీటర్ల దూరం ఉంది. మండలం నుంచి పట్టణాలకు వెళ్లాలంటే రవాణా సౌకర్యాలు సక్రమంగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెట్ట ప్రాంతం కావడంతో పొగాకు. శనగ, మినుము, పెసర తదితర మెట్టపైర్లను అధికంగా సాగు చేస్తుంటారు. ఆయా పంటల ఉత్పత్తులను అమ్ముకునేందుకు కలిగిరి, కందుకూరుకు తరలించాల్సి వస్తోంది. ఆ ప్రాంతంలోని రహదారి సింగిల్ రోడ్డు కావడంతో తరచూ పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. జిల్లాలోనే ఎక్కువగా వెనుకబడిన మండలంగా ఉన్న కొండాపురం మండలంలోని చింతలదీవిలో పశుసంవర్ధక క్షేత్రం ఏర్పాటు చేసి జాతీయస్థాయిలో జాతీయ కామధేను పునరుత్పత్తి కేంద్రం నిర్వహజిస్తున్నారు. దీంతో మండలానికి కొంతమేరకు రహదారి కనెక్టివిటీ పెరిగినా కలిగిరి మండలం నుంచి కొండాపురం మండలంలోకి సుమారు 19.6 కిలోమీటర్ల దూరం వెళ్లలంటే నరకప్రాయంగా ఉంది. ఈ నేపథ్యంలో రెండులేన్ల రహదారికి రూ.30 కోట్ల మంజూరు కావడం, ఈ పనులకు సంబంధించి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పైలాన్‌ను ఆవిష్కరించారు. పనులు కూడా ప్రారంభమైన నేపథ్యంలో త్వరగా పనులు పూర్తి చేసి రహదారి సౌకర్యం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్లు అభివృద్ధి చెందాలి



రోడ్లు అభివృద్ధి చెందితేనే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయి. గత ప్రభుత్వంలో రహదారులను పూర్తిగా పట్టించుకోలేదు. దీంతో ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం కలిగిరి నుంచి వలేటివారిపాలెం వరకు రెండు లేన్ల రహదారికి ప్రతిపాదనలు పంపగా తొలి విడతలో దాదాపు 20 కిలోమీటర్ల దూరం రోడ్డు విస్తరణకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

- పోలినేని చంద్రబాబునాయుడు, మాజీ వైస్ఎంపీపీ, కొండాపురం

తొలివిడతలో 19.6 కి.మీ రహదారి నిర్మాణం

తొలివిడతలో కలిగిరి మండలం నుంచి కొండాపురం మండలం వరకు 19.6 కిలోమీటర్ల దూరం రహదారిని రెండు లేన్ల రహదారిగా విస్తరించేందుకు ప్రభుత్వం ఆమోదించింది. ఆ మేరకు పనులు జరుగుతున్నాయి. మిగిలిన రహదారి విస్తరణకు ప్రభుత్వం ఆమోదించాల్సి ఉంది.

- మదన్‌కుమార్, డీఈ, ఆర్అండ్‌బీ, ఉదయగిరి


కొండాపురం మండల కేంద్రం సమీపంలో జరుగుతున్న ప్రధాన రహదారి పనులు

న్యూస్ బాక్స్

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

కందుకూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): యువత విద్యతోపాటు క్రీడలోనూ రాణించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆకాంక్షించారు. జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. గత నెల 28 నుంచి ఈనెల 1వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రం కటక్ పట్టణంలో జరిగిన 8వ ఓపెన్ తైక్వాండో నేషనల్ చాంపియన్‌షిప్ బాలికల విభాగం పోటీల్లో బీ.లక్ష్మీ అక్షరశ్రీ, సీ.లక్ష్మీప్రియ, బాలుర విభాగంలో ఏ మన్విత్‌రాజ్, జీ త్రినాథ్‌లు బంగారు పతకాలు సాధించారు. ఉత్తమ్ ప్రేమ్‌సాత్విక్, సాయి శ్రీవాత్సవ్‌లు రజిత పతకం, మోహిత్ కేసరినందన్ కాంస్య పతకం సాధించారు. వీరందరిని ఎమ్మెల్యే ఇంటూరి అభినందించారు. టీం కోచ్‌గా వ్యవహరించిన పీ.అఖిల్‌ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, జిల్లా కార్యదర్శి మాస్టర్ ఎస్‌కే అబ్దుల్ సలాం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

కందుకూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఉలవపాడు మండలం భీమవరం గ్రామానికి చెందిన రాయని మాల్యాద్రికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తన కార్యాలయంలో రూ.6,20,000 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందచేశారు. ఈ కార్యక్రమంలో భీమవరం గ్రామ టీడీపీ అధ్యక్షుడు జాజుల రవి, జలపతిరావు, దేవండ్ల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో పూడికతీత ప్రారంభం

కావలి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పట్టణంలో వర్షపు నీటితో మునక కాకుండా ముందు జాగ్రత్త చర్యల్లో బాగంగా పట్టణంలోని ప్రధాన డ్రైన్‌లలో పూడికతీత పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్ కుమార్ ప్రారంభించారు. సుమారు రూ.20 లక్షలతో పట్టణంలోని వరవకాలువ, పంట కాలువ, ట్రంకురోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రధాన కాలువలలో పూడికతీత పనులు చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. సాయిబాబా గుడి వీధిలో ఉన్న మురుగునీటి శుద్ధి ప్లాంట్ నుంచి కలుగోళ్ల శాంభవి ఆలయం వరకు వరవ కాలువలో తొలుత పూడికతీత పనులుచేపట్టారు. అనంతరం పట్టణంలోని అగ్రహారం బావి నుంచి 11వ వార్డులో అంబేడ్కర్ బావికి కలుపుతూ ఉన్న పైపు లైన్ల మరమ్మతుల పనులను స్థానిక వార్డు నాయకులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ ప్రాంతంలో ఉన్న తాగునీటి ఎద్దడి నివారణకు పైపులైన్ల పనులను త్వరితగతిన పూర్తి చేసి అంబేడ్కర్‌నగర్‌కు తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆయన ఇంజనీరింగ్ విభాగం వారిని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని సూచించారు.

ప్రత్యేక పీజీఆర్ఎస్ వాయిదా

లింగసముద్రం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో జరగాల్సిన ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం అనివార్య కారణాల వలన వాయిదా పడినట్టు తహసీల్దారు ఎస్ సీతామహాలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. తిరిగి ఈ కార్యక్రమం ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని ఆమె పేర్కొన్నారు.

మానవ జీవితంలో యోగా ఒక భాగం కావాలి



● తెళ్ల అశోక్, పంచాయతీ కార్యదర్శి, కలిగిరి-2 సచివాలయం

కలిగిరి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న దృష్ట్యా మానవ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలి. ప్రతి ఒక్కరు కొంత సమయాన్ని యోగాకు కేటాయించి ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలి. యోగాంధ్రలో భాగంగా కలిగిరి సచివాలయం వద్ద జరుగుతున్న యోగా క్లాసులను సద్వినియోగం చేసుకోవాలని కలిగిరి గ్రామ సచివాలయం-2, పంచాయతీ కార్యదర్శి తెళ్ల అశోక్ పట్టణ ప్రజలను కోరారు.

ఇంటర్వ్యూ

? యోగాంధ్ర విజయవంతానికి కార్యాచరణలు ఏమిటి.

! కలిగిరి పట్టణంలో యోగాంధ్ర కార్యక్రమంపై ఇంటింటి సర్వే చేశాం. ఆసక్తి ఉన్నవారికి మే 21 నుంచి జూన్ 21వరకు యోగా ట్రైనర్స్‌తో ప్రతిరోజు రెండు గంటల పాటు యోగా క్లాసులు నిర్వహించి శిక్షణ ఇప్పిస్తున్నాం.

? పంచాయతీలో పన్ను వసూళ్లకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! స్వర్ణ పంచాయతీ కార్యక్రమం కింద ఇళ్ల వివరాలను ఆన్‌లైన్ చేయడం జరుగుతుంది. తద్వారా పట్టణ ప్రజలకు పన్ను చెల్లింపు సులభతరం అవుతుంది.

? అందరికీ ఈకేవైసీ చేయడం జరుగుతుందా.

! జీఎస్‌డబ్ల్యుఎస్ వెబ్‌సైట్‌లో డేటా లేని వారి ఇళ్ల వద్దకు వెళ్లి అప్‌డేట్ ఈకేవైసీ చేయడం ద్వారా వారి కుటుంబ సభ్యుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదవుతాయి.

? గిరిజనులకు ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమం జరుగుతుందా. జనన ధ్రువీకరణ పత్రం ఎలా చేస్తున్నారు.

! పంచాయతీ పరిధిలోని ఎస్టీలకు ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమం జరుగుతోంది. పుట్టిన తేది ధ్రువీకరణ పత్రాలు లేనివారికి తహసీల్దారుచే నిర్ధారించబడిన డొమైసిల్ సర్టిఫికెట్ ఏర్పాటు చేసి ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమంలో వారికి కార్డులు ఇప్పిస్తున్నాం.

రూ.వంద కోట్లు తెచ్చా

● ఎమ్మెల్యే ఇంటూరికి ఘన సన్మానం ● టీడీపీ శ్రేణుల సంబరాలు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి గడిచిన ఏడాది కాలంలో రూ.100 కోట్లు తెచ్చానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది ఆలం పూర్తికావడంతో స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. నాయకులు, కార్యకర్తలు తదితరులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని పూల మాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటూరి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయిందన్నారు. కందుకూరు శివారు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అమృత్-2 పథకం కింద రూ.40 కోట్లు మంజూరు చేయించగా రూ.20 కోట్లతో సేవరేజ్ ప్లాంట్ రూపుదిద్దుకుంటుందన్నారు. కందుకూరు రూరల్ ప్రాంత ప్రజలకు రూ.22 కోట్లు జేజేఎం నిధులతో త్వరలో రామతీర్థం నీరు అందిస్తామన్నారు. 250 మందికి రూ.3 కోట్లు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశామన్నారు. ఐదు పాఠశాల అభివృద్ధికి రూ.7.50 కోట్లు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రూ. 60 లక్షల మంజూరు, రూ.1.37 కోట్లతో రైతులకు సబ్సిడీ పనిముట్లు అందచేశామన్నారు. రామాయపట్నం పోర్టు మరో ఏడాదిలో పూర్తిస్థాయి వినియోగంలోకి రానుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నే రోశయ్య, ఉప్పుటూరి శ్రీనివాసులు, బెజవాడ ప్రసాద్, జనిగర్ల నాగరాజు, మోషే, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభిమానుల రక్తదానం


రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అభిమానులు, టీడీపీ కార్యకర్తలు

కావలి, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : కావలి ఎమ్మెల్యేగా దగుమాటి వెంకటకృష్ణారెడ్డి గెలుపొంది, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం కావలి రెడ్‌క్రాస్ భవనంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు నాయకత్వంలో ఇందిరమ్మ కాలనీ యువ నాయకులు కొత్రపాటి రవి, అద్దంకి హరీష్, ఎమ్మెల్యే అభిమానులు, కార్యరకర్తలు రక్తదానం చేశారు.

● యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి

తలసేమియా బాధితుల చిన్నారులను కాపాడేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కావలి తహసీల్దారు పీ.శ్రావణ్‌కుమార్ పిలుపు నిచ్చారు. బుధవారం కావలిరెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు బెజవాడ ప్రసన్న కుమార్, ఆద్వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ భవనంలో జరిగిన రక్తదాన శిబిరాన్ని తహసీల్దారు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పుట్టుకతో జన్యుపరంగా వచ్చే తలసేమియా వ్యాధిగ్రస్తులకు జీవితాంతం రెండు నుంచి నాలుగు వారాల వ్యవధిలో రక్తం ఎక్కించుకోవాలన్నారు. రెడ్‌క్రాస్ సంస్థ వారికి ఉచితంగా రక్తం, మందులు, పౌష్టికాహారం అందచేస్తుందన్నారు. ఈ నెల మందులు, పౌష్టికాహారం దాత తానికొండ శ్రీనివాసరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు కే.హరినారపరెడ్డి, వైద్యులు పామూరు శ్రీధర్, టీ.రమ్య, కృష్ణారావు, ఆద్వి ఫౌండేషన్ సభ్యులు జగదీష్, వెంకటేష్, సునీల్, సుధాకర్, శేఖర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి


పనులు పరిశీలిస్తున్న ఏపీవో దయాసాగర్

వలేటివారిపాలెం, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : ఎండలను దృష్టిలో పెట్టుకొని పనుల వద్ద కూలీలకు వసతులు కల్పించాలని ఏపీవో దయాసాగర్ చెప్పారు. మండలంలోని బడేవారిపాలెం, నేకునాంపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీవో దయాసాగర్ బుధవారం పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేశారు. కూలీల సమక్షంలో మస్టర్లను చదివి వినిపించారు. ఈ సదర్భంగా ఏపీవో మాట్లాడుతూ ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లి తిరిగి 10 గంటల్లోపు ఇళ్లకు వెళ్లాలని తెలిపారు. కొలతల ప్రకారమే వేతనాలు లభిస్తాయని చెప్పారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న బీమా సౌకర్యలపై కూలీలకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలి

అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలని ఎంపీడీవో నరేంద్రదేవ్ తెలిపారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఫీల్డ్‌అసిస్టెంట్‌ల సమావేశంలో ఎంపీడీవో పాల్గొని మాట్లాడుతూ ఉపాధి పనుల్లో అక్రమాలకు తావులేకుండా చేపట్టాలని తెలిపారు. బోగస్ మస్టర్లు నమోదు చేస్తునట్లు తమ దృష్టికి వస్తే విచారించి శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. పనులు పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. పనుల వద్ద కూలీలకు తాగునీరు, టెంట్, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితర వసతులు కల్పించాలన్నారు. జాబ్‌కార్డులు లేని వారికి వెంటనే జాబ్‌కార్డులు మంజూరు చేసేలా చర్యలు చేపట్టి వాళ్లకు పనులు కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీవో దయాసాగర్, ఉపాధి సిబ్బంది ఫీల్డ్‌అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

వలేటివారిపాలెం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మాలకొండలో జరుగుతున్న అభివృద్ధి పనులను, భవిష్యత్‌లో భక్తులకు అవసరమైన పనులకు సంబంధించిన కార్యక్రమాలను చీఫ్ఇంజనీర్ శేఖర్‌తో కలిసి బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ.సాగర్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, ఎస్ఐ మరిదినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైకి చేరిన మురుగు


లింగసముద్రంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

లింగసముద్రం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : లింగసముద్రంలోని డ్రైనేజీ కాలువలోని మురుగు నీరు ఆర్అండ్‌బీ రోడ్డుపై ప్రవహిస్తోంది. కాలువలోని మురుగు నీరు కిందకు ప్రవహించకుండా కాలువలో మట్టి, చెత్తా చెదారం అడ్డుపడింది. దీంతో బుధవారం సాయంత్రం స్థానిక మసీదుకు సమీపంలోని మురుగు నీరు ఆర్అండ్‌బీ రోడ్డుపైకి వచ్చింది. దీంతో రోడ్డంతా బురదమయమై పోవడంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచు పులి రాఘవులు, పంచాయతీ కార్యదర్శి ఎం మాధవరావులు పంచాయతీ కార్మికులను రప్పించి, సాయంత్రం 6 గంటల సమయంలో కాలువలో అడ్డుగా ఉన్న మట్టిని, చెత్తా చెదారాన్ని తొలగింప చేశారు. దీంతో మురుగు నీరు రోడ్డుపైకి రావడం ఆగిపోయింది.

తప్పులను సవరించండి

● జీఎస్‌డబ్ల్యూఎస్ రాష్ట్ర డైరెక్టర్ శివప్రసాద్‌కు వినతి

కందుకూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో వలంటీర్లు, సచివాలయం సిబ్బంది నిర్వహించిన సాధికార సర్వేలో అంగన్‌వాడీ ఆయాలు నెలకు రూ.12000 గౌరవ వేతనం తీసుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులు కింద నమోదే చేశారని, ఆ తప్పును సవరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ బుధవారం విజయవాడలోని జీఎస్‌డబ్ల్యూఎస్ రాష్ట్ర డైరెక్టర్ ఎం శివప్రసాద్‌ను కలిసి కోరారు. వాస్తవానికి అంగన్‌వాడీ ఆయాలకు నెలసరి గౌరవ వేతనం రూ.7000 మాత్రమేనని, అయితే ఆ సర్వే ఇప్పటికి కొనసాగుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలకు అంగన్‌వాడీ ఆయాలు అనర్హులుగా ఆన్‌లైన్‌లో చూపిస్తుందని ఆధారలతో చూపించారు. దీనిపై స్పందించిన శివప్రసాద్ రెండు రోజుల్లో సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చినట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. తల్లికివందనం వంటి పథకాలు దూరం కాకుండా వెంటనే సమస్యను పరిష్కరించాలని లేదంటే అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని జిల్లా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

వైసీపీ నిరసన పాదయాత్ర



ఆర్డీవో సన్నీవంశీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి, తదితరులు

కావలిటౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వెన్ను పోటు దినంలో భాగంగా బుధవారం పట్టణంలో వైసీపీ శ్రేణులు నిరసన పాదయాత్ర చేపట్టారు. ముసునూరులోని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించేందుకు చేసుకున్న సన్నాహాలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పాదయాత్రగా ఆర్డీవో కార్యాలయం వరకు చేరుకుని అక్కడ ధర్నా నిర్వహించి ఆర్డీవో వంశీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి జన్మదిన వేడుకలు

మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ముసునూరులోని ఆయన క్యాంప్ కార్యాలయం వద్ద వైసీపీ శ్రేణులు, బంధుమిత్రులు పూలబొకేలు, కేక్‌లు, మిఠాయిలు అందించి జన్మదిన శుభాకంక్షలు తెలిపారు. కార్యకర్తలు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ప్రతాప్‌కుమార్ రెడ్డి కట్ చేయగా నేతలు తినిపించారు. ఆయన సతీమణి ఆదిలక్ష్మి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం వైసీపీ శ్రేణులతో కలసి రామిరెడ్డి రక్తదానం చేశారు.

వైసీపీ ఆధ్వర్యంలో ర్యాలీ


సబ్‌కలెక్టర్ శ్రీపూజకు వినతిపత్రం అందచేస్తున్న నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్, పార్టీ శ్రేణులు

కందుకూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలో ఇచ్చిన హామీలకు అమలు చేయలేదని రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా బుధవారం వైసీపీ పార్టీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ ఆధ్వర్యంలో కందుకూరులో అంబేడ్కర్ విగ్రహం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టో అములు చేయడంలో విఫలమైయిందని, రాష్ట్ర ప్రజలకు సంక్షేమం గాలికి వదిలేసిందని మాజీ ఎమ్మెల్యే బుర్రా ఆరోపించారు. అనంతరం పార్టీ శ్రేణులతో తరలివెళ్లి సబ్ కలెక్టర్ శ్రీపూజకు వినతిపత్రం అందచేశారు.

అనంతపురంలో రోడ్డు ప్రమాదం..

ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మృతి


తీవ్రంగా గాయపడిన రామమూర్తి


అనంతపురం సెంట్రల్/విడపనకల్లు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్ణాటక సరిహద్దు వద్ద భారత్ పెట్రోలు బంక్ సమీపాన బుధవారం మధ్యాహ్నం కారును గ్యాస్ ట్యాంకర్ ఢీకొన్న ప్రమాదంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి (50) మరణించారు. స్థానికులు, విడపనకల్లు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామమూర్తి అనంతపురంలోని అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తుండేవారు. వ్యక్తిగత పని మీద అనంతపురం నుంచి బళ్లారికి కారులో బయల్దేరారు. ఉరవకొండ-అనంతపురం 42వ జాతీయ రహదారిపై బళ్లారి నుంచి అనంతపురం వస్తున్న గ్యాస్ ట్యాంకర్ ఎదురుగా వచ్చి కారును ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న రామమూర్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు.. ఆయనను బయటకు తీసి విడపనకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తీసుకెళ్లారు. అక్కడ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం ఆయన మరణించారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గురువారం పోస్టుమార్టం నిర్వహించి నెల్లూరు జిల్లా అల్లూరు మండలంలోని సొంతూరికి మృతదేహాన్ని తరలించనున్నారు. రామమూర్తికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు బీటెక్ పూర్తిచేయగా, కుమార్తె అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలోనే బీటెక్ చదువుతోంది. రామమూర్తి మృతికి కళాశాల చైర్మన్ అనంతరాముడు, వైస్‌చైర్మన్ రమేష్ నాయుడు సంతాపం తెలిపారు.

శిథిలావస్థలో గ్రంథాలయం!

● వర్షం వస్తే తడుస్తున్నవైనం

అల్లూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : ఎంతో చరిత్ర కలిగిన బాపూజీ పార్కులోని గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకుంది. అల్లూరులో ఏకైక గ్రంథాలయం కావడంతో అడపాదడపా పాఠకులు ఇక్కడికి వచ్చి పత్రికలు పఠించి వెళ్తుంటారు. గతంలో ఎంతోమందికి జ్ఞానాన్ని అందించిన ఈ గ్రంథాలయం చివరకు మరుగున పడిపోయింది. ఈ క్రమంలో గ్రంథాలయ భవనం కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఇదే క్రమంలో వర్షాకాలంలో పూర్తిగా ఉరుస్తుండడంతో అందులోని పుస్తకాలు, పత్రికలు, సామగ్రి పూర్తిగా తడిచిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఇక్కడికి పాఠకులు రావడం తరచూ తగ్గుముఖం పట్టింది. భవనం ఏ క్షణంలో కూలిపోతుందోనని భయాందోళనలో స్థానికులు ఉన్నారు. దీనిని పూర్తిగా తొలగించి నూతన భవనాన్ని నిర్మించి అల్లూరు గ్రామ ప్రజలకు అన్ని హంగులతో కూడిన గ్రంథాలయాన్ని నిర్మించాలని పాఠకులు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన బాపూజీ పార్కులోని గ్రంథాలయం





రుయాస్పత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఐసీయూ పడకలు

కొవిడ్‌ను కట్టడి చేసేలా..!

జిల్లాలో తొలి కేసు నమోదుతో అప్రమత్తమైన వైద్యాధికారులు

రుయా, స్విమ్స్‌లో పరీక్షా కేంద్రాలు, ఐసీయూ పడకలు సిద్ధం

కొవిడ్ బారిన పడిన చిన్నారిని తీసుకెళ్లిన తల్లిదండ్రులు

రుయా చిన్నపిల్లల విభాగంలో కొవిడ్ బారిన పడి చికిత్స పొందుతున్న పది నెలల చిన్నారిని తల్లిదండ్రులు సిబ్బందికి తెలియకుండా బుధవారం తీసుకెళ్లి పోయారు. ఏర్పేడు మండలం పాపానాయుడుపేట ప్రాంతానికి చెందిన ఈ చిన్నారికి సోమవారం స్విమ్స్‌లో నిర్వహించిన ఆర్టీపీసీఆర్ పరీక్షలో కొవిడ్ పాజిటివ్ వచ్చింది. దీంతో మంగళవారం నుంచి ఆ చిన్నారిని రుయా చిన్నపిల్లల విభాగంలో ప్రత్యేక వార్డులో ఉంచి చికిత్స అందిస్తుండగా, తల్లిదండ్రులు తీసుకెళ్లిపోయారు. ఈ విషయం తెలిసి బుధవారం వైద్యులు, వైద్య సిబ్బంది ఆస్పత్రి పరిసరాల్లో వెతికినా వారి జాడ తెలియరాలేదు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, ఎటువంటి భయం అవసరం లేదని చిన్నపిల్లల విభాగం వైద్యులు పేర్కొన్నారు.



తిరుపతి(వైద్యం), జూన్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొలి కొవిడ్ కేసు నమోదుతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. కొవిడ్ వ్యాప్తి చెందినా ఎదుర్కొనేలా చర్యలు చేపట్టారు. ఇప్పుడు కొత్తగా ఎన్‌బీ1.8.1, ఎల్ఎఫ్.7 వేరియంట్లలో కొవిడ్ వ్యాపిస్తున్నట్లు వైద్యాధికారులు గుర్తించారు. ఇప్పటికే రాష్ట్రంలో నాలుగు కేసులు రాగా.. అందులో జిల్లాలో పది నెలల చిన్నారి ఉన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై కొవిడ్ కట్టడి దిశగా సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా స్విమ్స్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కొవిడ్ వార్డులో ఆరు వెంటిలేటర్ పడకలతోపాటు మరో పది ఆక్సిజన్ పడకలను సిద్ధం చేశారు. 22 టన్నుల సామర్థ్యం కలిగిన ఆక్సిజన్ ప్లాంటు స్విమ్స్‌లో ఉండటం వల్ల భవిష్యత్తులో ఆక్సిజన్‌కు ఎటువంటి ఇబ్బంది రాదని వైద్యాధికారులు చెప్పారు. ఆర్టీపీసీఆర్, రాపిడ్ కిట్లు కూడా సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయన్నారు. ఇక, రుయాస్పత్రిలోని ప్రత్యేక కొవిడ్ వార్డులో 40 ఐసీయూ పడకలను అధికారులు సిద్ధం చేశారు. మూడు ఆక్సిజన్ ప్లాంట్లు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రసూతి ఆస్పత్రిలోనూ గర్భిణుల కోసం ప్రత్యేక కొవిడ్ వార్డును సిద్ధం చేయడంతో పాటు సిబ్బందినీ నియమించారు. అలాగే 3కేఎల్, 6కేఎల్ సామర్థ్యం కలిగిన రెండు ఆక్సిజన్ ప్లాంట్లు అందుబాటులో ఉన్నాయి. కొవిడ్ ఏ దశలో వచ్చినా సమర్థంగా ఎదుర్కొనేలా సిద్ధమైనట్లు అధికారులు చెబుతున్నారు.

పీహెచ్‌సీల్లోనూ రాపిడ్ పరీక్షలు



స్విమ్స్, రుయాస్పత్రిలో కొవిడ్ పరీక్ష కేంద్రాలున్నా అవసరాన్నిబట్టి పీహెచ్‌సీల్లో కూడా రాపిడ్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశాం. ప్రజలూ కొవిడ్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలని చెప్పాం. ఏ వేరియంట్‌లో కొవిడ్ వచ్చినా ఎదుర్కొనేందుకు అవసరమైన మందులు, వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉంటే మొదట్లోనే కొవిడ్‌ను పూర్తిగా కట్టడి చేసే అవకాశం ఉంటుంది.

- డాక్టర్ బాలకృష్ణ నాయక్, డీఎంహెచ్‌వో

గర్భిణులు అప్రమత్తంగా ఉండాలి



రద్దీ ప్రాంతాల్లో తిరగకపోవడం గర్భిణులకు మంచిది. అలాగే ఒంట్లో నలతగా ఉన్నా, జ్వరం, ఎక్కువ రోజులు జలుబు వంటివి ఉన్నా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి. రక్తహీనతతో బాధపడే గర్భిణులు ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ప్రధానంగా కొవిడ్ నిబంధనలు పాటించాలి.

- డాక్టర్ పార్థసారథిరెడ్డి, సూపరింటెండెంట్, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి

చిన్నారుల పట్ల జాగ్రత్త



చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి. చిన్నారుల్లో చిన్నపాటి దగ్గు, జలుబు, జ్వరం వంటి లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించి వైద్య సలహాలు తీసుకోవాలి. సొంతంగా మందులు వాడటం మంచిది కాదు. నెలలు నిండని చిన్నారుల విషయంలో మరీ జాగ్రత్తలు పాటించాలి. వీరిని వీలైనంత వరకు బయటకు తీసుకురాకపోవడం ఉత్తమం. చిన్నారుల తల్లిదండ్రులూ బయట తిరిగేసమయంలో కొవిడ్ నిబంధనలు పాటించడం మంచిది.

- డాక్టర్ మనోహర్, చిన్నపిల్లల విభాగాధిపతి, రుయాస్పత్రి

ఏఆర్ కానిస్టేబుల్ డిస్మిస్

మరో రిజర్వు హెడ్ కానిస్టేబుల్ కూడా అరెస్టు

హైదరాబాదు డ్రగ్స్ కేసు పర్యవసానం



రామచంద్ర

తిరుపతి(నేరవిభాగం), జూన్ 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదు డ్రగ్స్ కేసులో ఏ1 నిందితుడైన తిరుపతి ఏఆర్ కానిస్టేబుల్ గుణశేఖర్‌ను డిస్మిస్ చేస్తూ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే కేసులో ఇతడితోపాటు తిరుపతి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ పూజారి రామచంద్ర కూడా నిందితుడు. వీరిద్దరినీ బుధవారం తిరుపతిలో కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేయడంతో పోలీసు వర్గాల్లో సంచలనం కలిగించింది. శాంతిభద్రతలను కాపాడాల్సిన విధుల్లో ఉండే వీరిద్దరూ డ్రగ్స్ సరఫరాలో కీలకంగా ఉండటం జిల్లాలో సంచలనం కలిగించింది. కేవీపల్లెకు చెందిన రామచంద్ర తిరుపతిలోని శ్రీకృష్ణనగర్‌లో నివాసం ఉంటున్నాడు. గుణశేఖర్‌లాగే ఇతడి పనితీరుపైనా ఆరోపణలున్నాయి. గతంలో రైల్వేలో పనిచేస్తుండగా డిస్మిస్ కావడమే నిదర్శనం. మూడు రోజుల కిందట హైదరాబాదుకు చెందిన ఎస్‌ఓటీ పోలీసులు ఒక దాబాపై దాడులు చేసి అక్కడ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్న క్రమంలో ఈ ముఠా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే ఐదుగురిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కాగా, తిరుపతి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రామచంద్ర, కానిస్టేబుల్ గుణశేఖర్ కొంత కాలంగా మంచి మిత్రులని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. గతంలో రైల్వేలో పనిచేస్తూ సర్వీసు నుంచి డిస్మిస్ అయిన రామచంద్ర.. 1991లో రిజర్వు విభాగంలో కానిస్టేబుల్‌గా చేరి.. ఇప్పుడు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందాడు. పదేళ్లుగా జిల్లా పోలీసు కార్యాలయంలో క్యాష్ ఆర్డర్లీ విధులు నిర్వహిస్తున్నాడు. ఇతడి విధి నిర్వహణ పట్ల గతంలో పలు ఆరోపణలు, విమర్శలు వచ్చినా వివిధ డ్యూటీల నిమిత్తం జిల్లా పోలీసు కార్యాలయానికి అధికారులు పంపడం గమనార్హం. జిల్లా పోలీసు కార్యాలయంలోని పరిపాలనా వ్యవహారాలకు సంబంధించిన ఓ అధికారికి ఇతడు అత్యంత సన్నిహితంగా ఉండటమే దీనికి కారణమన్న విమర్శలున్నాయి. మరోవైపు వీరిద్దరూ కొంత కాలంగా జిల్లా పోలీసు శాఖకు చెందిన అత్యంత రహస్య సమాచారాన్ని కొందరు వైసీపీ నాయకులకు చేరవేస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. వీరిద్దరు కొంత కాలంగా గంజాయితో పాటు నార్కోటిక్ డ్రగ్స్‌ను బెంగళూరు నుంచి తెప్పించి ఒంగోలు, గుంటూరు మీదుగా హైదరాబాదుకు సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో పాటు హైదరాబాదు పోలీసుల విచారణలో విస్తుగొలిపే విషయాలు వెల్లడించినట్లు తెలిసింది.

కూటమి సంబరాలు



తిరుపతిలో ఎమ్మెల్యే ఆరణి నివాసం వద్ద బాణసంచా పేలుస్తున్న జనసేన శ్రేణులు

రాష్ట్ర ప్రభుత్వ ఏడాది పాలన అద్భుతంగా ఉందని.. రాక్షస రాజ్యం నుంచి విముక్తి లభించిందంటూ బుధవారం కూటమి శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. ఇక, పార్టీ ఆదేశాలతో వైసీపీ శ్రేణులు వెన్నుపోటు దినం పేరిట నిరసన చేపట్టాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన నేపథ్యంలో సంబరాలు జరపాలని టీడీపీ ఎలాంటి పిలుపూ ఇవ్వలేదు. దీంతో కొన్ని నియోజకవర్గాల్లో నేతలు ఎలాంటి వేడుకలూ జరపలేదు. తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి వంటి చోట్ల మాత్రం నేతలు, శ్రేణులూ హంగామా చేశారు. తిరుపతిలో అలిపిరి పాదాల మండపం వద్ద ఏపీ అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ ఆధ్వర్యంలో కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. టౌన్ క్లబ్ కూడలిలో టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ నేతృత్వంలో ఎన్టీయార్ విగ్రహానికి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. చంద్రగిరి టవర్ క్లాక్ సెంటర్‌లో టీడీపీ శ్రేణులు కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చారు. ఎమ్మెల్యే పులివర్తి నానీ, డీసీఎంఎస్ ఛైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడు తదితరులతోపాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. శ్రీకాళహస్తి ఎన్టీఆర్ కూడలిలో టీడీపీ కార్యకర్తలు కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకోగా.. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. నాయుడుపేటలో సామాన్య టీడీపీ కార్యకర్త ఒకరు పేదలకు అన్నదానం చేశారు.

- ఇక, జనసేన అధిష్ఠానం పిలుపుతో పలుచోట్ల పార్టీ శ్రేణులు రోడ్డుపైకి వచ్చాయి. తిరుపతిలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్వీపీ నగర్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. సాయంత్రం ఎమ్మెల్యే నివాసం వద్ద దీపాలు వెలిగించి, బాణసంచా పేల్చారు. సూళ్ళూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లోనూ జనసేన నాయకులు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇచ్చారు. బీజేపీ మాత్రం సంబరాలకు దూరంగా ఉంది.



సత్యనారాయణపురం సర్కిల్ నుంచి ర్యాలీగా వస్తున్న వైసీపీ శ్రేణులు

వైసీపీ వెన్నుపోటు దినం

తిరుపతి సత్యనారాయణపురం కూడలి నుంచీ మున్సిపల్ పార్కు వరకూ వైసీపీ శ్రేణులు వెన్నుపోటు దినం పేరిట ర్యాలీ నిర్వహించి, ఆర్డీవో కార్యాలయానికి వెళ్ళి టీడీపీ కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ వినతిపత్రం అందజేశారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, పార్టీ ఇంచార్జి అభినయ్ తదితరులు పాల్గొన్నారు. చంద్రగిరిలో ఇంచార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో టవర్ క్లాక్ సెంటర్ నుంచీ వైసీపీ శ్రేణులు తహసిల్దారు కార్యాలయం వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. శ్రీకాళహస్తి వైసీపీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. నాయుడుపేటలో జరిగిన నిరసన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య.. గూడూరులో జరిగిన ర్యాలీలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, శ్రేణులు పాల్గొన్నారు. అధికారం కోల్పోయాక తొలిసారి వైసీపీ శ్రేణులు రోడ్డెక్కి నిరసన కార్యక్రమాలు చేపట్టినా మునుపటి జోష్ కనిపించలేదు.



చంద్రగిరి కోటలో యోగా

చంద్రగిరి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర ప్రచారంలో భాగంగా బుధవారం చంద్రగిరి కోటలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొని యోగాసనాలు వేశారు. గత నెల 21 నుంచి ఈనెల 21 వరకు జిల్లా, మండల, గ్రామ స్థాయి వరకు యోగాపై ప్రజలకు శిక్షణ, అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. అందులో భాగంగా ఇప్పటికే జిల్లావ్యాప్తంగా సుమారుగా 8 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు చెప్పారు. జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాల ప్రాధాన్యాన్ని యోగ ద్వారా అందరికీ తెలియజేయడం, తద్వారా పర్యాటకం గురించి తెలిసేలాగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేయడం వల్ల ఆరోగ్యం కాపాడుకోవచ్చని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. చంద్రగిరి కోటలో యోగాంధ్ర నిర్వహించడం వల్ల పర్యాటకంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, జేసీ శుభంబన్సల్, డీఆర్వో నరసింహులు, ఆర్డీవో రామ్మోహన్, ఏపీ టూరిజం రీజినల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, పర్యాటక శాఖ అధికారి జనార్దన్‌రెడ్డి, అధికారులు, నేతలు, స్థానికులు పాల్గొన్నారు.







పోలీసులే తోబుట్టువులై..!

- **మహిళా కానిస్టేబుల్‌కు సీమంతం చేసిన సహచర సిబ్బంది**


తడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆమెకు అన్నదమ్ముల్లేరు. ఆ లోటును భర్తీ చేస్తూ సహచర కానిస్టేబుళ్లే తోబుట్టువులయ్యారు. పోలీసు స్టేషన్‌లో ఆమెకు సీమంతం చేశారు. తమలోని మానవతను చాటారు. ఈ ఘటన బుధవారం తడ పోలీసు స్టేషనులో జరిగింది. తడలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న టి.ప్రమీల స్వగ్రామం నెల్లూరుజిల్లా మనుబోలు. సూళ్లూరుపేట అత్తగారి ఇల్లు. తల్లిదండ్రులు తప్ప అన్నదమ్ముల్లేరు. పెళ్లయిన పదేళ్ల తర్వాత ఆమె తొలిసారి గర్భవతి అయ్యారు. ఇటీవలే 9 నెలలు నిండి కాన్పుకు వెళ్లేందుకు ప్రసూతి సెలవు పెట్టుకున్నారు. మహిళా కానిస్టేబుల్ అయిన ఆమె కూడా ఆడబిడ్డే. తోడపుట్టిన అన్నదమ్ములు లేరని, శ్రీమంతం చేసుకోవాలని ఉన్నా ఆ యోగం తనకు లేదంటూ మనసులోనే బాధ పడేవారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌ఐ కొండపనాయుడు, సిబ్బంది ఆ ఆడపడుచుకు సోదరులయ్యారు. బుధవారం సాయంత్రం పోలీసు స్టేషన్‌లోనే ఆమెకు శ్రీమంతం జరిపించారు. దీంతో ప్రమీల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. సొంత అన్నదమ్ముల్లా సీమంతం జరిపిన తోటి సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

9 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రేణిగుంట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రేణిగుంటలోని విద్యుత్ ఉప కేంద్రంలో 100 వాట్ల నుంచి 160కి.. 360 వాట్ల నుంచి 420 వాట్లకు ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచే పనులను గురువారం నుంచి 9వ తేదీ వరకు చేపడుతున్నారు. ఈ పనులు జరిగేటప్పుడు అత్యవసర సమయంలో కరెంటు సరఫరా ఆపనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ(ఆపరేషన్స్) శ్రీనివాసన్ తెలిపారు. దీంతో 9వ తేది వరకు రేణిగుంట, తిరుపతి, చంద్రగిరి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.



జస్టిస్ హిరణ్మయ్ భట్టాచార్య



పీఎంఎస్ ప్రసాద్

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, జూన్4(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హిరణ్మయ్ భట్టాచార్య వేకువజాము సుప్రభాత సేవలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో రిలయన్స్ సీఈవో పీఎంఎస్ ప్రసాద్, ఎమ్మెల్యే గుమ్మానూరు జయరాం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఆర్టీసీ బస్ డ్రైవర్‌పై కానిస్టేబుల్ దాడి!



తిరుమల, జూన్4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎలక్ట్రికల్ డ్రైవర్‌పై ఓ కానిస్టేబుల్ దాడి చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివరాలివి.. తిరుమలలోని మాధవనిలయం ముందు మంగళవారం రాత్రి 7.30 గంటలకు ప్రయాణికులను ఎక్కించుకునే క్రమంలో ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్ ఆపాడు. ట్రాఫిక్‌కి అంతరాయం కలిగిస్తున్నాడని వెనుకే ద్విచక్రవాహనంపై వస్తున్న కానిస్టేబుల్ ఆగ్రహంతో బస్సు ఎక్కి డ్రైవర్‌పై దాడి చేశాడు. బస్సులోని సీసీ కెమెరాల్లో ఈ దృశ్యాలు రికార్డు అయ్యాయి. ప్రస్తుతం ఆ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. తమకు ఫిర్యాదు రాలేదని, డ్రైవర్ నుంచి ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేస్తామని టూటౌన్ పోలీసులు తెలిపారు.

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.29 కోట్లు

మంగళవారం దర్శించుకున్న భక్తుల సంఖ్య: 78,631

తలనీలాలు సమర్పించినవారు: 31,247

● ప్లాస్టిక్ వ్యర్థాలతో మనుగడకు పెనుసవాలు

● నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ముప్పును మోసుకొస్తున్న సంచులు

జీవరాశుల మనుగడలో పర్యావరణ పాత్ర కీలకం. ఆధునిక పరిస్థితుల నేపథ్యంలో రకరకాల కారణాలతో రాన్రానూ పర్యావరణ సమతుల్యం దెబ్బతింటోంది. మానవ మనుగడకు సవాలు విసురుతోంది. కాలుష్య కోరల్లోకి చేర్చుతూ ప్రమాదంలోకి నెట్టేస్తోంది. ప్రజలు, ప్రభుత్వాలు మేల్కొని బాధ్యతగా స్పందించకపోతే భావితరాల జీవనానికి పెనుముప్పు కాగలదని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

- తిరుపతి రూరల్ (ఆంధ్రజ్యోతి)

ప్లాస్టిక్ వ్యర్థాలతో ముప్పు

ప్లాస్టిక్.. ఈతరం ప్రజల జీవితంతో విడదీయరానంతంగా పెనవేసుకుపోయింది. ఉదయం పాలప్యాకెట్లతో మొదలై ప్రతి చిన్న వస్తువుకూ కవరుగా మారిపోయింది. నగరంలో ఈ ఈ ప్రభావం మరితం ఎక్కువగా ఉంది. ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగం పెరిగి పర్యావరణానికి, ఆరోగ్యానికి పెనుముప్పుగా తయారైంది. ప్రమాదకర వ్యాధులకు కారణమవుతోంది. పలుచగా తక్కువ బరువు ఉండటంతో యూజ్ అండ్ త్రో కవర్లను విరివిగా వాడుతున్నారు. అవసరం తీరాక ఈ సింగిల్‌యూజ్ పాలిథిన్ వ్యర్థాలను డ్రైనేజీ కాలువలు, చెత్తకుప్పలు, రోడ్డుపక్కన పడేస్తున్నారు. ఇవి భూమిలో కలిసేందుకు వేల సంవత్సరాలు పడుతుందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. ఆవులు, గేదెలు, మేకలు, కుక్కలు లాంటివి తెలియకుండా ఆహారంగా తీసుకుని అనారోగ్యం పాలవుతున్నాయి. నిర్దేశిత ప్రమాణాలను అతిక్రమిస్తూ టీ షాపుల్లో వాడుతున్న కప్పులు, పార్సిల్ కోసం వినియోగిస్తున్న ప్లాస్టిక్ వస్తువులు క్యాన్సర్ లాంటి ప్రమాదకర వ్యాధులకు కారణమవుతున్నాయి.

నిషేధం అమలు అంతంతమాత్రమే..

తిరుపతి నగరంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించినా అమలు నామమాత్రంగానే ఉంది. అధికారులు చిత్తశుద్ధితో ఉద్యమంలా ప్రజల్లో అవగాహన కల్పిస్తే నిషేధానికి ముకుతాడు వేయడం కష్టమేంకాదు. అమ్ముతున్న వారిపై కేసులు పెట్టి చేతులు దులుపుకొనే కన్నా వాటి ఉత్పత్తి మూలాలను గుర్తించి కట్టడి చేయాలని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. కొన్ని సంస్థలు ఇప్పటికే తమ ఉత్పత్తుల ప్యాకింగుకు గుడ్డ సంచులు ఇస్తున్నాయి. ఈ సంస్కృతి అన్నిటా వ్యాపించేల చూడాలి. తిరుమలలో ప్లాస్టిక్ వాటర్‌బాటిళ్ల విక్రయాల నిషేధం మాత్రం పక్కాగా అమలవుతోంది. గాజుసీసాలను వినియోగిస్తున్నారు.



పెరుగుతున్న వాయుకాలుష్యం

తిరుమల నేపథ్యంలో భారీ సంఖ్యలో రోజూ వచ్చే వాహనాలతో పొగ కాలుష్యం పెరిగిపోతోంది. గాలిలోని పర్టిక్యులేట్‌మేటర్స్(పీఎం) కారకాలుగా పనిచేస్తున్నాయి. మూడేళ్లకు ముందు తిరుపతిలో పీఎం 2.5లెవల్స్ 22మైక్రోగ్రామ్/మీటర్‌క్యూబ్ ఉండగా..ఇటీవల 32 మైక్రోగ్రామ్/మీటర్‌క్యూబ్‌గా నమోదైనట్లు సమాచారం. పీఎం10లెవల్స్‌మూడేళ్లకు ముందు 53మైక్రోగ్రామ్/మీటర్‌క్యూబ్‌గా ఉండగా ఇప్పుడు 74మైక్రోగ్రామ్/మీటర్‌క్యూబ్‌కి చేరుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.. డబ్ల్యూహెచ్‌వో సిఫార్సుల మేరకు పీఎం 2.5లెవల్స్‌లో 15 మైక్రోగ్రామ్/మీటర్‌క్యూబ్‌గా, పీఎం10లెవల్స్‌లో 45 మైక్రోగ్రామ్/మీటర్‌క్యూబ్ ఉండాలి. ఈ పెరుగుదల క్రమంలోనే అనారోగ్యసమస్యలు తలెత్తుతున్నాయి. తిరుపతి పరిసరాల్లో పారిశ్రామికాభివృద్ధి, అమాంతం పెరిగిన డీజిల్ వాహనాలు, వ్యర్థాల కాల్చివేత లాంటి వాటివల్ల కూడా గాలి కాలుష్యమవుతోంది. ఇది పర్యావరణానికి చేటు కలిగిస్తూ అనారోగ్యసమస్యలకు కారణమవుతోంది.

తూకివాకం వద్ద ప్లాంట్

నగరంలో రోజుకు సగటున రెండు టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తవుతున్నాయి. వీటిలో పునర్వినియోగపరచదగినవి(రీసైకిల్), పునర్వినియోగపరచలేని(నాన్ రీసైకిల్) వేరు చేసేందుకు తూకివాకం వద్ద పీపీపీ విధానంలో(సెంట్రలైజ్డ్ యూనిట్)ఘనవ్యర్థాల నిర్వహణ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఇది రోజుకు ఐదు టన్నుల ప్లాస్టిక్‌ని ప్రాసెసింగ్ చేసే సామర్థ్యాన్ని కలిగిఉంది. తక్కువ గ్రేడ్ ప్లాస్టిక్‌ని కూడా ఇక్కడప్రాసెస్ చేస్తున్నారు. రీయూజ్‌బుల్ కానివాటిని జిందాల్‌గ్రూప్ సంస్థతో ఒప్పందం చేసుకుని ప్రాసెస్ చేస్తున్నారని తెలిసింది.



అవగాహన పెంచాలి



ప్లాస్టిక్ వ్యర్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన పెంచాలి. తరచూ సదస్సులు నిర్వహించాలి. కర్బన ఉద్గారాలు తగ్గించేందుకు విరివిగా మొక్కలు నాటాలి. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి. ప్రత్యామ్నాయ వినియోగాలవైపు ప్రజల దృష్టి మరల్చాలి. చిత్తశుద్ధితో పర్యవేక్షణ అవసరం. సింగిల్ యూజ్ కవర్ల ఉత్పత్తిని ఆపగలిగితే ఉత్తమం. ఎకోఫ్రైండ్లీని పెంచాలి.

- ప్రొఫెసర్ డాక్టర్ తేటి దామోదరం, పర్యావరణ శాస్త్రవిభాగ హెడ్, ఎస్వీయూ

తడి, పొడిచెత్త వేరుచేసి ఇవ్వాలి



తిరుపతి నగరంలో తడి, పొడిచెత్తలను వేరుచేయకుండా ఇస్తున్నారు. దీని నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేయడం కష్టంగా ఉంటోంది. ఇంటివద్దే వేరుచేసి ఇవ్వాలి. ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలను పడేయడాన్ని మానుకోవాలి. ఇది అనారోగ్య సమస్యలను తెచ్చిపెడుతుంది. చెత్తను కాల్చినపుడు వచ్చే పొగతో కాలుష్యంతోపాటు అనారోగ్యసమస్యలు తలెత్తుతాయి.

-ఎన్.మౌర్య, నగరపాలకసంస్థ కమిషనర్

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిరసనమాల చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యం లో బుధవారం అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది వెలికి తీశారు. మంగళవారం సాయంత్రం దిరసనమాల గ్రామానికి చెందిన శ్రీనివాసులు(55), తన భార్య మాధవితో కలసి తప్పిపోయిన ఆవు, దూడలను వెతికేందుకు చెరువు వద్దకు వెళ్లారు. ఆవు ఒడ్డుకు చేరుకోగా దూడ చెరువు నీళ్లలో చిక్కుకుపోయింది. దూడను కాపాడానికి చెరువులోకి దిగిన శ్రీనివాసులు నీళ్లలోనే మునిగిపోయాడు. తన కళ్లముందే మునిగిపోతున్న భర్తను కాపాడ్డానికి మాధవి కేకలు వేసింది. గ్రామస్తులు గాలించినా శ్రీనివాసులు ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ నాగరాజు, వీఆర్వో భూదనం రమేష్, పంచాయతీ కార్యదర్శి సమ్మన ప్రభాకర్, అగ్నిమాపక అధికారులు చెరువు వద్దకు చేరుకున్నారు. అప్పటికే చీకటి పడడంతో గాలింపు చర్యలకు అంతరాయం ఏర్పడింది. దీంతో బుధవారం తిరిగి గాలింపు చర్యలు కొనసాగించారు. ఉదయాన్నే శ్రీనివాసులు మృతదేహం చెరువు నీటిపై తేలియాడడంతో వెలికితీసి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆస్పత్రి వద్దకు చేరుకుని మృతుని కుటుంబసభ్యులను ఓదార్చారు. పంచనామ అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక తవ్వకాలను అడ్డుకున్న రైతులు



హిటాచిని అడ్డుకున్న గ్రామస్తులు

పెళ్లకూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖినదిలో జరుగుతున్న ఇసుక తవ్వకాలను దిగువ కలవకూరు సమీపంలో రైతులు అడ్డుకున్నారు. మండలంలోని ఎగువ కలవకూరు, పుల్లూరు గ్రామాల సమీపంలోని స్వర్ణముఖినదిలో పూడికతీత అవసరమని భావించి కూలీలతో ఇసుకను తరలించేందుకు అధికారులు అనుమతులు ఇచ్చారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా భారీ యంత్రాలతో ఇసుకను ఇష్టానుసారంగా తవ్వి తరలిస్తుండంతో చింతపూడి గ్రామానికి చెందిన రైతులు అడ్డుకున్నారు. దీంతో వాహనదారులకు, రైతులకు నడుమ కాసేపు వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో గ్రామస్తులు ధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పుల్లూరు, కలవకూరు, చింతపూడి పరిధిలోని స్వర్ణముఖినదిలో తాగు, సాగునీటి బోరుబావులు ఉన్నాయన్నారు. అలాంటి ప్రాంతంలో పూడికతీత పేరుతో అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. ఇసుక తరలిస్తే బావులు ఎండిపోయి పంటల సాగు కష్టమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పూడికతీత పేరుతో ఇచ్చిన అనుమతులను రద్దుచేయాలని కోరారు.

ఉగ్రవాదులపై నిరంతర అప్రమత్తత అవసరం

● భద్రతా దళాలు, టీటీడీ సిబ్బందితో ఏఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ రామకృష్ణ

తిరుమల, జూన్4(ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్రంలో అలజడి సృష్టించేందుకు ఏరూపంలో ఉగ్రవాదులొచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు భద్రతాదళాలతో పాటు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ రామకృష్ణ అన్నారు. తిరుమల ఆస్థానమండపంలో టీటీడీ విజిలెన్స్, సివిల్ పోలీసు, ఏఆర్, ఏపీఎస్పీ, ఎస్పీఎఫ్, ఫైర్‌తో పాటు టీటీడీ అధికారులు, సిబ్బంది, అర్చకులు, పోటు కార్మికులు, ట్యాక్సీ డ్రైవర్లు, మఠాల నిర్వాహకులతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. ఉగ్రవాదులు మనలోనే కలిసిపోయి హింస సృష్టించేందుకు ప్రణాళికలు రూపొందిస్తుంటారన్నారు. కూలీల ముసుగులోనూ వచ్చే అవకాశాలుంటాయన్నారు. కొన్ని సందర్భాల్లో మనం గుర్తించే చిన్నచిన్న విషయాలే పెద్ద విపత్తుల నుంచి రక్షించేందుకు ఉపయోగపడతాయన్నారు. సూరత్‌లో ఉగ్రవాదులు అమర్చిన బాంబులను స్థానికులే గుర్తించడంతో దాదాపు 29 బాంబుల నుంచి ప్రజలు ప్రాణాలతో బయటపడ్డారని సోదాహరించారు. ఇదే తరహాలో దేశంలోని పలు ఆలయాల్లో జరిగిన ఉగ్రదాడులు, అక్కడ జరిగిన నష్టం, ఎలా బ్లాస్టులు చేశారు వంటి వివిధ అంశాలను స్క్రీన్‌పై ప్రదర్శించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే ఎలా స్పందించాలి, తక్షణం చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు.

సింహ వాహనంపై అనంత తేజోమూర్తి





తిరుపతి అర్బన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): నగరంలో గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం మాడ వీధుల్లో సింహ, రాత్రి ముత్యపు పందిరి వాహనాల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. వాహనం ముందు గజరాజులు, గోవులు ఠీవీగా నడుస్తుండగా కళాబృందాలు కోలాటాలు, వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి.మంగళవాయిద్యాల నడమ ఈ ఉత్సవం కోలాహలంగా సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. ఉత్సవాల్లో జియ్యంగార్లు, టీటీడీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జేమ్స్‌పై దాడి కేసులో మరో ఆరుగురి అరెస్టు

తిరుపతి(కలెక్టరేట్),జూన్4(ఆంధ్రజ్యోతి): రంగంపేటలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న జేమ్స్‌పై గతనెల 14న జరిగిన దాడిలో 18మందిపై కిడ్నాప్, హత్యాయత్నం, అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. రెండు రోజుల క్రితం ప్రధాన నిందితుడు యశ్వంత్‌తో పాటు 12మందిని తిరుచానూరు పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించారు. బుధవారం ఈ కేసులో ప్రమేయమున్న చోటా బ్లేడ్, దీపక్‌కుమార్, జగదీష్, సాయి హరితేజ, రూపేష్, సోమశేఖర్‌లను పాడిపేట శేషాద్రినగర్ వద్ద అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సునీల్‌కుమార్, ఎస్ఐ సాయినాథ్ చౌదరి తెలిపారు.రూపేష్‌పై రౌడీషీట్, చోటా బ్లేడ్, జగదీష్‌లపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వివరించారు. కాగా, అరెస్టు అయిన ఆరుగురూ వైసీపీకి చెందిన మాజీ మంత్రి, తిరుపతి మాజీ డిప్యూటీ మేయర్ అనుచరులే కావడం గమనార్హం.

ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్‌గా చరణ్

తిరుపతి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ తిరుపతి జోన్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా రుద్రరాజు చరణ్ నియమితులు కానున్నారు. ప్రస్తుతం స్టేట్ ఆడిట్ శాఖలో స్పెషల్ క్యాడర్ అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా తిరుపతిలో పనిచేస్తున్న చరణ్‌ను ప్రభుత్వం బుధవారం పరిశ్రమల శాఖకు డెప్యుటేషన్‌పై బదిలీ చేసింది. ఆ శాఖలో ఆయన ఏపీఐఐసీ తిరుపతి జోన్‌కు డిప్యూటీ జోనల్ మేనేజర్ (అసెట్ మేనేజ్‌మెంట్) పోస్టులో నియమితులు కానున్నారు. డెప్యుటేషన్‌పై ప్రాథమికంగా ఆయన సంబంధిత పోస్టులో ఏడాది పాటు కొనసాగనున్నారు. పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.యువరాజ్ బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

యూనివర్సిటీల్లో అభివృద్ధి ఇలా..!

● వర్సిటీ అధికారుల సమావేశంలో ఎస్వీయూ, పద్మావతి అధికారుల నివేదన





సమావేశంలో పాల్గొన్న ఎస్వీయూ, పద్మావతి వర్సిటీ అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ, పద్మావతి యూనివర్సిటీలను ఈ విధంగా అభివృద్ధి చేస్తున్నామంటూ ఆయా యూనివర్సిటీల అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. విజయవాడలో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ బుధవారం నిర్వహించిన యూనివర్సిటీ అధికారుల సమావేశంలో ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, పద్మావతి వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని పాల్గొన్నారు. ఇటీవల యూనివర్సిటీల్లోని పరిణామాలు, కొత్త కార్యక్రమాలు, కొత్త లక్ష్యాలను వారు రాష్ట్ర ఉన్నత విద్యామండలికి వివరించారు. బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో అభివృద్ధిని ప్రామాణికంగా, వేగవంతంగా చేపట్టడం ద్వారా ప్రపంచ స్థాయి ర్యాంకులను యూనివర్సిటీలు సొంతం చేసుకోవాలని ఉన్నత విద్యామండలి అధికారులు సూచించారు.

వేద వర్సిటీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

● దరఖాస్తుకు ఈనెల 10 చివరి గడువు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు)జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వేద విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న పలు కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు.సమగ్ర సమాచారం కోసం.. వేదిక్ యూనివర్సిటీ.. పేర గల వెబ్‌సైట్ చూడాలని ఆ వర్సిటీ పీఆర్వో డాక్టర్ బ్రహ్మాచార్యులు కోరారు.



జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

10న నాయుడుపేటలో మెగా జాబ్‌మేళా

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నాయుడుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 10వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని, శ్రీసిటీ, మేనకూరు సెజ్, ఈఎంసీ క్లస్టర్, తిరుపతి, చెన్నైలోని 17 బహుళజాతి కంపెనీల్లో 900కు పైగా ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 5వ తరగతి పైన, పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణులైన యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంబంధిత లింక్‌లో ఈనెల 9వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9985056929, 9154449677లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి గణేష్ పాల్గొన్నారు.

జనసేన సంబరాలు



రంగవల్లుల వద్ద జనసేన నాయకులు

గూడూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చి ఏడాది కావడంతో జనసేన పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని కొండాగుంట గ్రామంలో మహిళలు రంగవల్లులు వేసి సంబరాలు నిర్వహించుకున్నారు. జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ మాట్లాడుతూ వైసీపీ అరాచకపాలన అంతమై ఎన్‌డీఏ సుపరిపాలన మొదలై ఏడాది కావడంతో సంబరాలు చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్, విజయ్, సాయిక్రిష్ణ, మనోజ్, సుమన్, ముత్యాలు, మస్తాన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేకపాలన సాగుతోంది



వైసీపీ నిరసనలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఏడాదిగా ప్రజా వ్యతిరేక పాలన సాగుతోందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడుపేట అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం వెన్నుపోటు దినం పేరుతో వైసీపీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి అధికార పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు కలికి మాధవరెడ్డి, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి రాజారెడ్డి, చైర్ పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, సహకార సంఘ మాజీ అధ్యక్షుడు కామిరెడ్డి రాజారెడ్డి, దారా రవి, దశరథరామిరెడ్డి, భవానీరెడ్డి, కమలాకర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి ఉన్నారు.

కూటమి సుపరిపాలనకు ఏడాది



అన్నదానం చేస్తున్న సుమిత్ర, తదితరులు

నాయుడుపేట టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ సుపరి పాలన ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా అంకు సుమిత్ర ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని అన్నాక్యాంటీన్‌లో 450 మంది పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకురాలు సుమిత్ర మాట్లాడుతూ పేదల ఆకలితీరుస్తున్న కూటమి ప్రభుత్వం మరో దశాబ్దం పాటు పాలన సాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శేషం మునిగోపీ, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, భార్గవి, రమ్య, రుషిత తదితరులు ఉన్నారు.

కాకాణితో వైసీపీ ఎంపీల ములాఖత్

● 11, 12 తేదీల్లో జగన్ నెల్లూరు రాక

నెల్లూరు(క్రైం), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు సెంట్రల్ జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో బుధవారం రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి ములాఖత్ అయ్యారు. అనంతరం మిధున్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 11, 12 తేదీల్లో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కాకాణిని పరామర్శించేందుకు నెల్లూరు సెంట్రల్ జైలుకు వస్తారని తెలిపారు. అక్రమంగా, అకారణంగా కాకాణిపై కేసులు పెట్టి జైలుకు పంపడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడం లేదని ప్రశ్నించడమే కాకాణి చేసిన తప్పన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నాయకులపై తప్పుడు కేసులు పెడుతూ ఏదో జరిగిపోతుందని, భయభ్రాంతులకు గురిచేయడం సరైన పద్ధతి కాదన్నారు. కాకాణి జైల్లో ఎంతో ధైర్యంగా ఉన్నారని , ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా భయపడేది లేదని ఆయన చెప్పారు. త్వరలోనే ఆయన జైలు నుంచి బయటకు వస్తారని ఆశిస్తున్నామన్నారు.

పర్యావరణ రక్షణ కోసం మొక్కలు నాటాలి



కొండాపురం సచివాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

వాకాడు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఆయా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణంలో ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని ఎంపీడీవో శ్రీనివాసులు సూచిం చారు. మండలంలోని కొండాపురం పంచాయతీలో ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాలు లాంటి సమస్యలు ఉంటే ప్రజలు కాల్‌సెంటర్ నెంబరు 9505234689కి ఫోన్‌చేసి పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు.

ఇంటికి దారిలేకుండా చేశారు..న్యాయం చేయండి

పెళ్లకూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా తమ ఇంటికి ఉన్న దారిని దౌర్జన్యంగా మూసేశారని, దీనిపై తగిన న్యాయం చేయాలని తహసీల్దార్ ద్వారకనాథరెడ్డికి బాధితులు విన్నమాల ధనయ్య, అక్కుర్తి చిన్ని వీరరాఘవులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈసదర్భంగా వారు మాట్లాడుతూ బంగారంపేట పంచాయతీ మోదుగుల పాలెం గ్రామంలో ఎన్నో ఏళ్లుగా పంచాయతీ వీధి ఉందని గుర్తు చేశారు. తమ ఇంటికి పక్కన వారు తమ ఇంటికి దారి లేకుండా వీధిని ఆక్రమించారని వాపోయా రు. దారి స్థలంలో ఫెన్సింగ్ వేసి పూర్తిగా దారి మూసేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ముగిసిన యోగాసనాలు



కోట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని 16 సచివాలయాలలో జరుగు తున్న యోగా సన శిక్షణా తరగతులు బుధ వారం ముగిశాయి. ఎంపీడీవో దిలీప్ కుమార్‌నాయక్ పర్య వేక్షణలో యోగా ప్రాముఖ్యతను తెలుపుతూ సచివాలయాల వారీగా శిక్షణ తరగతులు జరుగు తున్నాయి. శిక్షణ తరగతులు ముగియడంతో గురు వారం మండలస్థాయి యోగాసన శిక్షణ తరగతులు జరుగుతాయని మండల స్థాయిలో ఆయా ట్రైనర్లకు శిక్షణ ఇస్తామని ఎంపీడీవో తెలిపారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



మాట్లాడుతున్న ఎంఈవో జగదీష్ బాబు

డక్కిలి, జూన్ 4 : (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో పిన్నక జగదీష్‌బాబు సూచించారు. బుధవారం స్థానిక జడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజన నిర్వా హకులకు టాటా ట్రస్టు ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్న క్రమంలో మెనూపై అవగాహన కల్పించారు. పిల్లలకు ఇంటి రుచులతో భోజనం వడ్డించాలని తెలియ జేశారు.

మహిళలకు ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న జనసేన నాయకులు ఉయ్యాల ప్రవీణ్ తదితరులు

సూళ్లూరుపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా బుధవారం సూళ్లూరుపేటలోని సూళ్లూరు లో జనసేన ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ము గ్గుల పోటీలకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ కుమార్ విచ్చేశారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆవుల రమణ, తుసిరెడ్డి, నక్కా హరిబాబు, వల్లూరు కిరణ్, కృష్ణారావు, పద్మజ కామాక్షి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడిని జయించవచ్చు



యోగాసనాలు చేస్తున్న అధ్యాపకులు

సూళ్లూరుపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): యోగాసనాలు చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండడమే కాకుండా ఒత్తిడిని జయించవచ్చునని డిగ్రీ కళాశాల ప్రిన్సి పాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా ట్రైనర్ నివేదిత ఆధ్వర్యంలో అధ్యాపకులకు, విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పిం చారు. యోగాసనాలు వేయించారు. అధ్యాపకులు సుబ్రమణ్యం, బి.శ్రీనివాసులు, అమ్మాజీ, ఎన్‌సీసీ అధికారి ఏడుకొండలు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో చోరీ

నాయుడుపేట టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు ఏఈ వీరాస్వామి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన కంప్యూటర్ సామగ్రి దాదాపు లక్ష రూపాయలు విలువచేస్తాయని తెలియజేశారు.

న్యాయం చేసేవరకు కంటైనర్లను కదలనివ్వం

నాయుడుపేట టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మృతుడి కుటుంబానికి న్యాయం చేసేవరకు కంటైనర్‌లను వదిలేదని లేదని ఓజిలి మండలం గ్రద్దకుంట గ్రామస్తులు స్పష్టం చేశారు. మేనకూరు సెజ్ సమీపంలో కంటైనర్ ఢీకొని ఆదివారం గ్రద్దకుంటకు చెందిన చిరంజీవి అనే యువకుడు మృతిచెందాడు. ప్రమాద సమయంలో కంటైనర్లకు సంబంధించిన కంపెనీ వారు మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ప్రమాదం జరిగి మూడు రోజులైనా న్యాయం జరగకపోవడంతో బుధవారం గ్రామస్తులు మేనకూరు సెజ్ నుంచి నాయుడుపేట వైపు వెళుతున్న లారీలను వారి గ్రామ సమీపంలో ఆపేశారు. పోలీసులు ఇరువర్గాలతో చర్చిస్తున్నారు.

మామిడి రైతులు విలవిల

దిగుబడి రాక ధరలు లేక



తిప్పవరపాడు గ్రామ సమీపంలో మామిడి తోట (ఇన్‌సెట్లో) బంగినపల్లి మామిడి కాయలు

గూడూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలాలు శ్రమించి.. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి.. తీరా ఫల సాయం చేతికి అందే సమయంలో ఆశించిన దిగుబడులు రాకపోవడంతో మామిడి రైతులు విలవిలలాడుతున్నారు. ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవడంతో.. మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లేకపోవడంతో నష్టాలబాటలో నడుస్తూ ఆర్థికంగా చితికిపోతున్నారు.

గూడూరు మండలంలో ఈ ఏడాది 750 ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోటల సాగు చేపట్టారు. ఇందులో 520 ఎకరాల విస్తీర్ణంలో మామిడి కాయలు కాసే తోటలు ఉన్నాయి. ప్రధానంగా ఈ ప్రాంతంలో బంగినపల్లి, రసాలు, నీలం, పునాశ, అంటుమామిడి వంటి రకాల తోటలను సాగు చేస్తుంటారు. ఇందులో 85 శాతంకు పైగా బంగినపల్లి రకానివే. ఈ ప్రాంతంలో బంగినపల్లి రకానికే డిమాండ్ ఎక్కువ. అందుకే రైతులు వీటినే సాగు చేసేందుకు మక్కువ చూపుతుంటారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడం, కాయలకు నల్లి పురుగు పట్టడం కారణంగా ఆశించిన ఆదాయం అందడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తగ్గిపోయిన దిగుబడి

మామిడి పూత దశకు చేరుకునేందుకు, పిందె నిలబడేందుకు పురుగు మందులు పిచికారి చేయాల్సి ఉంటుంది. ఎకరా మామిడి సాగుకు రూ.1.50 లక్షల పైగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఎకరా మామిడి చెట్లకు సరాసరి 10 టన్నుల వరకు కాయల దిగుబడి వస్తుంది. కాయల నాణ్యతను బట్టి ధరలు ఉండడంతో రైతుల ఖర్చుల పోనూ ఎంతో కొంత ఆదాయం మిగులుతుంది. ఈ ఏడాది 10 ఎకరాలలో 10 టన్నుల దిగుబడి కూడా రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తోటలను లీజుకు తీసుకునే కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఎకరాకు లీజు రూ.30 వేలకు వరకు చెల్లిస్తారు. దీనికి తోడు కాపు సాగుకు రూ. 1.50 లక్షల వరక వెచ్చించారు. ఈ ఏడాది వాతావరణంలో మార్పుల వలన ఈదురుగాలలకు చెట్ల నుంచి కాయలు రాలిపోయాయి. కాయలకు నల్లిపురుగు పట్టడంతో చెట్ల మీదే కాయలకు నల్లమచ్చలు ఏర్పడ్డాయి. అలాగే పురుగులు పట్టడంతో అవి కాస్త రాలిపోయా యి. ఈ ఏడాది ఎకరాకు టన్ను కాయలు కుడా దిగుబడి రాలేదని దిగాలు చెందుతున్నారు. గతేడాది ఎకరాకు 10 టన్నులు కాయలు వస్తే టన్ను ధర రూ.80 వేల వరకు పలికిందని చెబుతున్నారు. ఈ ఏడాది ఎకరాకు టన్ను కాయలు కూడా దిగుబడి రాలేదని పైగా టన్ను రూ. 30 వేల వరకు మాత్రమే ధరలు పలుకుతోందని ఆవేదన చెందుతున్నారు. నష్టపోతున్న మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

నాణ్యమైన పురుగుమందులు అందజేయాలి



ఈ ఏడాది మామిడి కాయలకు నల్లి పురుగు పట్టడంతో ఐదు సార్లుగా పైగా పురుగుమందులను పిచికారి చేశాం. అయినా ఫలితం లేకుండా పోయింది. ఎకరాకు రూ. 1.50 లక్షలకు పైగా పెట్టుబడులు పెట్టినా రూ. 40 వేలు కూడా రాలేదు. ప్రభుత్వం నాణ్యమైన పురుగు మందులను అందించేలా చర్యలు తీసుకోవాలి.

- డి.సుబ్బారెడ్డి, రైతు, తిప్పవరపాడు గ్రామం

అప్పులే మిగిలాయి



ఈ ఏడాది ఎకరాకు రూ.30 వేలు లీజు చెల్లించి బంగినపల్లి మామిడితో టను తీసుకున్నా. ఎకరాకు రూ. 1.40 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. ప్రస్తుతం ఎకరాకు టన్ను లోపే దిగుబడి వచ్చింది. పురుగు పట్టడంతో పాటు ఈదురుగాలులకు కాయలు రాలిపోవడంతో కాపు చేతికి అందలేదు. టన్ను రూ. 30 వేలకు వరకు మాత్రమే ధరలు పలుకుతోంది. నష్టపోయా. మిగిలాయి.

- ఎస్‌కే.ఖాదర్‌బాషా, కౌలురైతు, నెల్లూరు.

వెన్నుపోటు దినం నిర్వహించడం హాస్యాస్పదం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అరాచకానికి ప్రజలు తగిన గుణపాఠం చెబితే వైసీపీ నాయకులు వెన్నుపోటు దినం పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ఆగడాలు భరించలేక ప్రజలు ఆ పార్టీని 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెప్పిన విధంగా పింఛన్‌ను 1000 రూపాయలు పెంచిందన్నారు. కార్పొరేషన్ రుణాలను అందిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీల ను ఆదుకుంటోందన్నారు. అన్నక్యాంటీన్లను తిరిగి ప్రారంభించి తక్కువ ధరలకే పేదలకు మూడు పూటలా ఆకలి తీర్చుతోందన్నారు. త్వరలోనే తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలను ప్రారంభించనుందన్నారు. ప్రజలంతా గమనిస్తున్నారని మరోసారి వైసీపీకి తగిన బుద్ధిచెప్పడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వాటంబేడు శివకుమార్, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, రవీంద్రరెడ్డి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు



మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో సిద్ధంగా ఉన్న మొక్కలు

సూళ్లూరుపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వనం-మనం కార్యక్రమంలో భాగంగా సూళ్లూరుపేటలో గురువారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటునున్నారు. . జీఎన్‌టీ రోడ్డు నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి, యూనియన్ బ్యాంకు రోడ్డులో మున్సిపాలిటీ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో గుంతలు తవ్విస్తున్నారు. అదేవిధంగా మండ లంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటనున్నట్లు ఎంపీడీవో మురళీకృష్ణ తెలిపారు.

అభివృద్ధి దిశగా రాష్ట్రం



మహిళలకు బహుమతులు అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్, కృష్ణ తదితరులు

నాయుడుపేట టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది పాలనలో రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా పరుగులు తీస్తోందని సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్‌కుమార్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా బుధవారం పట్టణంలోని గాంధీ మందిరం వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలతో పాటు పాల్గొన్నవారందరికీ బహుమతులు అంద జేశారు. జనసేన నాయకులు అట్లకృష్ణ, సతీష్ పాల్గొన్నారు.

రాక్షస పాలన విముక్తి దినం



మాట్లాడుతున్న పేరం రమేష్‌నాయుడు

పెళ్లకూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన శుభ దినాన్ని రాక్షస పాలన విముక్తి దినంగా పాటిస్తున్నామని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, ఆ పార్టీ సీనియర్ నాయకులు పేరం రమేష్ నాయుడు, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పెళ్లకూరులోని రమేష్‌నాయుడు నివాసంలో వారు మీడియాతో మాట్లాడారు.

రాక్షస పాలనకు స్వస్తి పలికి ఏడాది : టీడీపీ



మాట్లాడుతున్న జలీల్ అహ్మద్, మధుయాదవ్

కోట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఐదేళ్లపాటు కొన సాగిన రాక్షసపాలనకు ప్రజలు చరమగీతం పాడి ఏడాది అయిందని టీడీపీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, వెంకన్నపాళెం సర్పంచ్ మధుయాదవ్ తెలిపారు. కోటలోని రవినగర్‌లో గల టీడీపీ కార్యాలయంలో బుధ వారం వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా ఈ నెలలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ అమలు కాబోతున్నాయని వివరించారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయా ణం అమలుకాబోతుందని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రాష్ట్రం నవ్యాంధ్రవైపు పరుగులు తీస్తోందన్నారు.

కుక్కలదాడిలో జింక మృతి



కోట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెం సమీపంలో ఉన్న చల్లకాలువలో బుధవారం కుక్కలదాడిలో చుక్కల జింక మృతి చెందింది. చిల్లకూరు మండలం ఉడతావారిపాళెం, అంకులపాసూరు, పల్లమాల అటవీప్రాంతం నుంచి ఓ జింక దాహార్తిని తీర్చుకునేందుకు నెల్లూరుపల్లి కొత్తపాళెం వద్ద ఉన్న చల్లకాలువలోకి వచ్చింది. కుక్కలు దానిపై దాడి చేశాయి. స్థానికులు రక్షించారు. అప్పటికే అది మృతి చెందింది. అటవీ అధికారులు జింక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చని కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

గూడూరు అర్బన్, జూన్ 4 (ఆంధ్ర జ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. బుధవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు వైసీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం పేరుతో ర్యాలీ నిర్వహించారు. సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేంద్రరెడ్డి, భక్తవత్సలరెడ్డి, బాలకృష్ణారెడ్డి, సునీల్‌రెడ్డి, గురవయ్య, బొమిడి శ్రీనివాసులు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో సిబ్బంది కొరత సమస్యను పరిష్కరిస్తాం

● ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి



వెంకటగిరి ఆర్టీసీ డిపోను పరిశీలిస్తున్న ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి

వెంకటగిరిటౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ఎదుర్కొంటున్న సిబ్బంది కొరతను త్వరలోనే పరిష్కరిస్తామని ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో, బస్టాండ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ డిపోలో నెలలో ఒక రోజు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. అధికారులు, కార్మికులు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అధికారులు, కార్మికులు మొక్కల పెంపకాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. గూడూరు -వెంకటగిరి రోడ్డు నిర్మాణం పనులు సీఎం దృష్టికి తీసుకెళ్లామని త్వరలోనే రూపకల్పన చేస్తామన్నారు. మూతబడిన డక్కిలి బస్టాండు, అభివృద్ధికి నోచుకోని బాలాయపల్లి బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకొస్తామని వివరించారు. వెంకటగిరి ఆర్టీసీ బస్టాండ్‌ను సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు టీటీ మణి, గోపాల్‌నాయుడు, కోటీశ్వరరావు, మేక రమ్యశ్రీరవి, భాస్కర్, దశరథరెడ్డి, డీఎం రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.